ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY









వశిష్ఠ గోదావరికి పంచ హారతులు

పెనుగొండ, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సిద్ధాంతంలో వశిష్ఠ గోదావరికి శుక్రవారం రాత్రి పౌర్ణమి సందర్భంగా పంచ హారతులు ఇచ్చారు. స్థానిక హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రమా సత్యనారాయణ మాస్టారు కుటుంబ సభ్యులు, నాగరాజు సునీత ప్రియదర్శినిలచే వేదమూర్తులు కలగభద్రుడు స్వామి బ్రహ్మణత్వంలో ఏకముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, కుంభ, సర్ప, హారతులు ఇచ్చారు. నదీమ తల్లులను ఆరాధించడం అనాదిగా వస్తున్న మన సంప్రదాయమని ఆయన తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులతోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శాకంబరిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల క్షేత్ర దేవత కుంకుళ్లమ్మ శాకంబరిగా శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చింది. శ్రావణ మాసంలో పౌర్ణమికి ముందువచ్చే శుక్రవారం వివిధ రకాల పండ్లు, కూరగాయలు, డ్రై ఫ్రూట్స్‌తో అమ్మవారిని శోభాయమానంగా అలంకరించారు. ఆమెను దర్శిస్తే సకల సౌభాగ్యాలు, శుభాలు కలుగుతాయన్న నమ్మకంతో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

గాజుల అలంకారంలో మావుళ్లమ్మ

భక్తులు సమర్పించిన తొమ్మిది లక్షల గాజులను దండలుగా తయారు చేసి మావుళ్లమ్మ ఆలయ ప్రాంగణాన్ని అలంకరించారు. భక్తులు భారీగా తరలివచ్చారు. -6లో..



వరాలివ్వు తల్లీ.. వరలక్ష్మీ అంటూ మహిళలు ఇంటింటా వ్రతాలు చేశారు. అమ్మవారి విగ్రహాలను కొలువు తీర్చి పూజలు నిర్వహించారు. లోపలి పేజీల్లో

రూ.9 లక్షలు గోల్‌మాల్

» 13 నెలలుగా సభ్యుల సొమ్ము చెల్లించని డ్వాక్రా సభ్యురాలు

నరసాపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 28 వార్డులో వున్న ఒక డ్వాక్రా సంఘంలో తొమ్మిది లక్షల రూపాయలు గోల్‌మాల్ అయిన విషయం వెలుగు చూసింది. బ్యాంకు నుంచి తీసుకున్న రుణాన్ని చెల్లించాలని ప్రతి నెల సభ్యులు ఇచ్చినా.. సొమ్మును గ్రూప్‌లోని ఓ సభ్యురాలు కట్టకుండా స్వాహా చేసింది. 13 నెలల తర్వాత భాగోతం బయటపడింది. బాకీ కట్టాలంటూ బ్యాంకు అధికారులు సభ్యులకు సమాచారం పంపడంతో వీరంతా షాక్ తిన్నారు. ఇంత సొమ్ము తాము ఎక్కడ కట్టగలమంటూ లబోదిబోమంటున్నారు. డ్వాక్రా గ్రూపులను పర్యవేక్షించే సిటీ మిషన్ మేనేజర్ రత్నకర్‌ను వివరణ కోరగా.. నిధులు కట్టని విషయం వాస్తవమేనని, ఆ సభ్యురాలను పిలిపించి ఆరా తీశామన్నారు. ఆమె రెండు నెలల్లో కడతానని హామీ ఇచ్చినట్టు తెలిపారు.

తోబుట్టువు తోడుగా

సోదరీ సోదరుల బంధానికి ప్రతీక రక్షాబంధన్.. నేడు రాఖీ పండుగ

మార్కెట్‌లో బంగారు రాఖీలు - 6లో

పదవుల పండగ

మూడో విడత 50 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

» జాబితాలు సిద్ధం.. పరిశీలించి నివేదిక ఇచ్చిన సహకార శాఖ అధికారులు
» నేడో, రేపో ఉత్తర్వులు జారీ..
» 'స్థానిక' అలసత్వంతో భీమవరానికి మరోసారీ..
» జిల్లాలో ఇక పెండింగ్‌లో వున్నవి 17

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని 50 సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీల మూడో విడత జాబితా సిద్ధమైంది. ఈసారి నరసాపురం, తాడేపల్లిగూడెం, ఉండి నియోజకవర్గాల్లోనే అత్యధిక సంఘాలున్నాయి. కూటమి నేతలు ప్రభుత్వానికి పంపిన జాబితాలు మూడు రోజుల క్రితం జిల్లా సహకార శాఖకు అందాయి. కమిటీ సభ్యుల పేర్లను పరిశీలించిన అధికారులు కమిటీల్లో వున్న వారందరికీ సంఘాల్లో సభ్యత్వం ఉన్నట్టు నిర్ధారించి ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం తొలి విడత కలువపూడి సొసైటీకి, రెండో విడతలో 54 సొసైటీలకు త్రిసభ్య కమిటీలను ప్రకటించింది. ఇందులో కమిటీలు బాధ్యతలు స్వీకరించాయి. కమిటీల గడువును జనవరి 30వ తేదీ వరకు పొడిగించారు. జిల్లాలో ఇంకా 67 సొసైటీలకు కమిటీలను ప్రకటించాలి. జాబితాలు వెళ్లడంలో జాప్యం కారణంగా భీమవరం, ఉండి, తాడేపల్లిగూడెం, నర్సాపురం నియోజకవర్గాల్లో సంఘాలు పెండింగ్‌లో ఉన్నాయి. మూడో విడత ప్రకటించనున్న 50



సొసైటీల జాబితాలో భీమవరం నుంచి ఒక్కటి లేదు. టీడీపీ, జనసేన మధ్య సయోధ్య కొలిక్కి రాకపోవడంతో జాబితా పంపడంలో జాప్యం జరిగింది. టీడీపీ ముందుగానే పంపగా, జనసేన మాత్రం జాప్యం చేసింది. భీమవరం నుంచి ఎంపిక లేకపోవడంతో టీడీపీ కేడర్ విస్మయం వ్యక్తం చేస్తోంది. ఇప్పటికే ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను కలిసి అసంతృప్తిని వెలిబుచ్చారు.

పెండింగ్‌లో 17 సొసైటీలు

తాడేపల్లిగూడెంలోని కొమ్ముగూడెం సొసైటీపై టీడీపీ, జనసేన మధ్య ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఇరు పార్టీల నుంచి జాబితాలు వెళ్లడంతో దీనిని పెండింగ్‌లో పెట్టారు. జిల్లా మొత్తం మీద 17 సొసైటీలు పెండింగ్‌లో ఉండగా వీటిలో భీమవరం తొమ్మిది, తాడేపల్లిగూడెం ఐదు, నరసాపురం, తణుకు, ఆచంట ఒక్కొక్కటి చొప్పున ఉన్నాయి. మొత్తం 122 సొసైటీలకు తొలి విడత ఒకటి, రెండో విడత 54 ప్రకటించగా, మూడో విడత 50 ప్రకటించనున్నారు. పెండింగ్‌లో 17 సొసైటీలు వున్నాయి.

కమిటీలు నియమించిన సొసైటీలు

- **తాడేపల్లిగూడెం** : పెదతాడేపల్లి, ఆరుగొలను, అలంపురం, రావిపాడు, కోరుమిల్లి, ముదునూరు, పడమర విప్పర్రు
- **తణుకు** : వేల్పూరు, కొమరవరం, తూర్పువిప్పర్రు, కె.ఇలింద్రపర్రు, రాపాక, బల్లిపాడు, అత్తిలి.
- **ఆచంట** : దేవ, సిద్ధాంతం, ఇలపర్రు, చినమల్లం, వెలగలేరు, వల్లూరు, జిన్నూరు, పండితవల్లూరు, పెనుమదం, కవిటం.
- **ఉండి** : ఆకివీడు, చెరుకుమిల్లి, యండగండి, పెదపుల్లేరు, కాళ్ల, కోపల్లె, కాళ్లకూరు, పాలకోడేరు, శృంగవృక్షం, కుముదవల్లి, విస్సాకోడేరు.
- **నరసాపురం** : నరసాపురం ఎల్‌బీ చర్ల, సీతారాంపురం, కొప్పర్రు, మల్లవరం, తూర్పుతాళ్లు, మొగల్తూరు, కాళీపట్నం, కెపిపాలెం, జగన్నాథపురం.
- **పాలకొల్లు** : సిరగారపల్లి, కాజా, ఆగర్రు, బూరుగుపల్లి, వాలమర్రు సంఘాలు వున్నాయి.

ఉండి ఏఎంసీ చైర్మన్‌గా కలిదిండి

» జుత్తిగ స్థానంలో మార్పు చేసిన ప్రభుత్వం
» సామాజిక సమీకరణాల్లో డిప్యూటీ స్పీకర్‌దే పైచేయి
» భీమవరం, నరసాపురం, ఉండి, పెనుగొండ ఏఎంసీలకు కమిటీలు సిద్ధం.. త్వరలో జీవోలు



(భీమవరం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో భీమవరం, ఉండి, నర్సాపురం, పెనుగొండ వ్యవసాయ మార్కెట్ కమిటీలకు చైర్మన్‌లను ఖరారు చేసిన ప్రభుత్వం తాజాగా పాలకవర్గ జాబితాలు సిద్ధం చేసింది. కూటమి నేతలు సిఫారసు చేసిన పేర్లనే మార్కెటింగ్ శాఖ ప్రభుత్వానికి పంపింది. ఈ మేరకు త్వరలో కమిటీల నియామకంపై ప్రభుత్వం జీవో విడుదల చేస్తుంది. తొలుత ఉండి ఏఎంసీ చైర్మన్‌గా ప్రకటించిన జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ జుత్తిగ నాగరాజును మార్పు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆయన స్థానంలో కలిదిండి రామరాజు పేరును ఖరారు చేస్తూ ప్యానల్‌ను సిద్ధం చేసింది. వాస్తవానికి ఉండి నియోజకవర్గంలో ఆకివీడు ఏఎంసీ బీసీ జనరల్‌కు, ఉండి ఏఎంసీ జనరల్‌కు కేటాయించారు. ఆకివీడులో ఉండిలో బీసీ సామాజికవర్గానికి చెందిన టీడీపీ నేత బొల్లా వెంకట్రావుకు కేటాయించగా.. ఉండిలో బీసీకి చెందిన నాగరాజును నియమిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయితే జనరల్ కేటగిరీలో బీసీకి కేటాయిస్తే ఇబ్బందులు తలెత్తుతాయని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినట్టు సమాచారం. తర్జన భర్జనల అనంతరం అధిష్ఠానం నాగరాజును మార్పు చేసింది. అయితే నాగరాజుకు తొలుత రాష్ట్రస్థాయి కార్పొరేషన్‌లో డైరెక్టర్ పదవిని కేటాయిస్తే ఆయన దానిని తిరస్కరించారు. ఆయనను సంతృప్తి పరచాలని ఏఎంసీ చైర్మన్ పదవిని కట్టబెట్టారు. తాజాగా దానిని తొలగించారు. మరి ఇప్పుడు ఏం చేస్తారో చూడాలి. ఇప్పటికే తాడేపల్లిగూడెం, తణుకు, పాలకొల్లు, అత్తిలి, ఆకివీడు ఏఎంసీలకు పాలకవర్గాలను ప్రకటించడంతో వారు బాధ్యతలు స్వీకరించారు. ఆచంట ప్యానల్ ఖరారు చేయాలి.

నాయీ బ్రాహ్మణులకు శుభవార్త

» 200 యూనిట్ల వరకు విద్యుత్ ఉచితం..
» జిల్లాలో 800 సెలూన్లకు లబ్ధి

భీమవరం టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):నాయీ బ్రాహ్మణులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. సెలూన్‌లకు 200 యూనిట్ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందించేలా మంత్రివర్గం ఆమోదం తెలిపింది. గతంలో నాయీ బ్రాహ్మణులకు టీడీపీ ప్రభుత్వం ఉచితంగా పనిముట్లు అందించింది. అనంతరం వైసీపీ సర్కార్ వాటికి స్వస్తి చెప్పింది. తాజాగా 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌పై నాయీ బ్రాహ్మణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సెలూన్లు నిర్వహించే వారికి నెలకు రూ.1200 నుంచి రూ.1300 ఆదా అవుతుందని భావిస్తున్నారు. జిల్లాలో 800 వరకు సెలూన్‌లు వున్నాయి. ఉచిత విద్యుత్ అమలుతో నెలకు రూ.10 లక్షల వరకు ప్రభుత్వంపై అదనపు భారం పడుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు



సెలూన్‌లకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రకటించడం ఆనందంగా ఉంది. విద్యుత్ బిల్లులు కట్టలేక చాలా మంది షాపులు మూసివేస్తున్నారు. కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

- తాతపూడి చందు, నాయీ బ్రాహ్మణ సంఘం యువజన రాష్ట్ర అధ్యక్షులు

నాయీ బ్రాహ్మణులకు ఊరట



నాయి బ్రాహ్మణుల సెలూన్‌లకు 200 యూనిట్‌ల వరకు విద్యుత్‌ను ఉచితంగా అందించటం ఆనందించదగ్గ విషయం. గత ప్రభుత్వంకంటే అదనంగా 50 యూనిట్ల పెంపుతో చంద్రబాబుకు రుణపడి వుంటాం.

- మల్లువలస రాము, టీడీపీ జిల్లా నాయీ బ్రాహ్మణ సాధికారిక కమిటీ కన్వీనర్

ఆలయ ధర్మకర్తల మండళ్లకు నోటిఫికేషన్

భీమవరం టౌన్/ఆచంట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ ఆలయాల నూతన ధర్మకర్తల మండలి సభ్యుల నియమాలకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసింది. ఇందులో భీమవరం మావుళ్ళమ్మ, పంచారామ క్షేత్రాలైన గునుపూడి సోమేశ్వరస్వామి, పాలకొల్లు క్షీరా రామలింగేశ్వరస్వామి, క్షీరపురి అన్నదాన సమాజం, ఆచంట రామేశ్వరస్వామి, పెదమల్లం పల్లాలమ్మ, మాచేనమ్మ, నత్తా రామేశ్వరం రామేశ్వరస్వామి, తాడేపల్లిగూడెం ముత్యాలమ్మ, దువ్వ దానేశ్వరి, నరసాపురం ఆదికేశవ ఎంబర్‌మన్నార్, భీమవరం దంతులూరి జగన్నాథ రాజు సత్రం పద్మావతి వేంకటేశ్వరస్వామి దేవస్థానాల పాలక మండళ్లను నియమించనున్నారు. ఈ మేరకు నోటిఫికేషన్ జారీ తేదీ నుంచి నిర్ణీత 20 రోజుల్లో సంబంధిత అధికారులకు పత్రాలు సమర్పించుకోవాలని ఏపీ ధార్మిక పరిషత్ సభ్య కార్యదర్శి కె.రామచంద్రమోహన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

భీమవరం మావుళ్ళమ్మ ఆలయ చైర్మన్‌గా బొండాడ నాగభూషణం పేరును ఎమ్మెల్యే అంజిబాబు ప్రతిపాదించారు. సోమేశ్వరస్వామి ఆలయానికి చింతలపాటి బంగారాజును నియమించారు. ధర్మకర్తల మండలి సభ్యుల పేర్లను కూటమి తరఫున సిద్ధం చేశారు. ఆచంట రామేశ్వరస్వామి ఆలయ చైర్మన్ పదవి టీడీపీకి, పెదమల్లం మాచేనమ్మ ఆలయ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించారు.

గండి.. గండం



రోజు రోజుకు గట్లు బలహీనం



అప్పారావుపేట వద్ద ఎర్రకాల్వకు గండి (ఫైల్)

- **ఇసుక మేట తీయలేదు**



నాకు ఎర్ర కాలువను అనుకుని 90 సెంట్ల పొలం ఉంది. అందులో పది సెంట్ల మేర ఇసుక మేటలు ఉన్నాయి. వాటిని తీయడం తలకు మించిన భారం అవుతోంది. పంట కోసం తీద్దామనుకుంటే రూ.2 లక్షలు ఖర్చవుతుంది. ఏం చేయాలో అర్థం కావడం లేదు.

- అడబాల ఆంజనేయులు, మాధవరం

- **దేవుడి దయ ఉంటేనే..**



అయిదు ఎకరాలు కౌలుకు చేస్తున్నా. ఎకరానికి రూ.25 వేలకుపైగా ఖర్చవుతోంది. వర్షాకాలం వచ్చిందంటే దేవుడిపై భారం వేసి సాగు చేస్తున్నాం. దేవుడి దయ ఉంటే మాకు పంట చేతికొస్తుంది. లేదంటే నీటి పాలే.

- కొండపల్లి సుబ్రహ్మణ్యం, అప్పారావుపేట

- **బలహీనపడుతున్న గట్టు**



మా చేను వెంబడి వున్న కాలువ గట్టు రోజు రోజుకు కుచించుకుపోతోంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాసవర్మ, రామానాయుడు, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌ల దృష్టికి తీసుకెళ్లాం. త్వరితగతిన పనులు చేస్తారని ఆశిస్తున్నాం. గత ప్రభుత్వ విధానాలతో ఇప్పటికే చాలా ఆలస్యమైంది.

- కలగాని ప్రభాకర్, మాధవరం

» ఏళ్లు గడుస్తున్నా ఎదురుచూపే
» ఎర్రకాలువ రైతుల ఆందోళన
» గండ్లు పూడ్చాలని మంత్రులకు వినతి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్ర కాలువ గట్ల వెంబడి పడిన గండ్లు భయపెడుతున్నాయి. వేసవి తర్వాత వేసే ఖరీఫ్ పంట నారు పోసిన నాటి నుంచి కోత కోసే వరకూ పంటను కాపాడాలని రైతులు దేవుడిని మొక్కుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వచ్చిన భారీ వరదలకు గట్లకు గండ్లు పడి చేలన్నీ కొల్లేరు చెరువుల మాదిరి ఏకమై పంట కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఏటా గండ్లు పూడుస్తారని రైతుల ఎదురుచూస్తున్నా గండ్లు పూడ్చే పని ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వం ఆ పనులు చేస్తారని ఆశలు వదులుకున్న రైతులు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వారి ఆశలు చిగురించాయి. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే ఎర్ర కాలువకు వంద కోట్లకు పైగా నిధులు వెచ్చించి గట్లు పటిష్ఠం చేశారనే చరిత్ర ఉండటంతో రైతులు ఆనందించారు. గత ఏడాది జూన్‌లో వరదలు రాగా పంట నష్టం జరిగింది. సమస్య గుర్తించిన ప్రభుత్వం తాత్కాలిక గండ్లు పూడికకు రూ.2 కోట్లు వెచ్చించగా శాశ్వత ప్రాతిపదికన రూ.9 కోట్లతో ఎమ్మెల్యే బొలిశెట్టి ప్రతిపాదనలు పంపించారు. కానీ పనులకు నిధులు విడుదల కాకపోవడంతో ఈ ఏడాది పంటకు ఏమవుతుందని రైతులు ఆందోళనలో ఉన్నారు.

తాడేపల్లిగూడెం పరిధిలోని బంగారుగూడెం నుంచి ఆరుళ్ల వరకూ 18 చోట్ల గండ్లు పడినట్టు అధికారులు గుర్తించారు. అప్పారావుపేట వద్ద ఓ గండి 200 మీటర్లపైగా పడిపోవడంతో అటు కింద ఉన్న వందలాది ఎకరాలకు ఇసుక మేటలు వేసి నేటికీ ఆ ఇసుక తొలగించలేని పరిస్థితి కనిపిస్తోంది. ఇప్పటికైనా గండ్లను త్వరితగతిన శాశ్వత ప్రాతిపదికన చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గండ్లు పూడిక చేపట్టకపోవడంతో ఎర్ర కాలువ ఒక మాదిరిగా ప్రవహిస్తుండటంతో గట్లు రోజురోజుకు బలహీన పడుతున్నాయి. గట్టు సన్నబడిపోవడంతోపాటు స్థానికంగా ఉండే కొందరు మట్టి మాఫియా రాత్రి వేళల్లో గట్లు కొల్లగొడుతుండటం వల్ల గట్టు మాయమవుతుందా ? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా ఇంకెంత కాలం ?

గతంలో వరదలకు కొట్టుకుపోయిన పుంతలు, చెరువు గట్లకు పడిన గండ్లను ఎమ్మెల్యే బొలిశెట్టి పిలుపుతో అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఐదు గండ్లు పూడ్చారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోయినా వరదలను దృష్టిలో పెట్టుకుని ఈ పనులు చేయించారు. నిధుల విడుదల జాప్యంతో పనులు ముందుకు కదలలేదు.

ముందస్తుగా పనులు చేశాం



ఎర్ర కాలువ వరదలకు కాలువ గట్లతోపాటు చెరువు గట్లు, పుంత గట్లు చిన్న బోదెల గట్లన్నీ కొట్టుకుపోయాయి. చెరువులు నిండినా ఇబ్బంది పడే పరిస్థితి. దీంతో ఎమ్మెల్యే బొలిశెట్టి చొరవతో ముందస్తుగా చెరువు గట్లు పూడిక చేపట్టాం. ఎర్రకాలువ గట్లు పటిష్ఠం చేసేందుకు ప్రతిపాదనలు పంపాం.

అడ్డగర్ల ప్రసాద్, కోతిగుంట నీటి సంఘు అధ్యక్షుడు, మాధవరం

ఏటిగట్టును పట్టించుకోండి

» దొంగరావిపాలెం నుంచి భీమలాపురం వరకు రహదారి అధ్వానం.. పంటలను తరలించేందుకు రైతుల అవస్థలు
» అభివృద్ధి చేయాలని కోరుతున్న ఆరు గ్రామాల ప్రజలు

ఆచంట, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):వశిష్ఠ ఏటిగట్టు రహదారి అధ్వాన్నంగా మారడంతో గోదావరి తీర ప్రాంతాల ప్రజలు రవాణాపరంగా ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలకు రహదారి ఇరువైపులా తుప్పలు పెరిగి చిట్టడివిని తలపిస్తోంది. మరోపక్క గోతులు ఏర్పడి రాళ్లు లేచిపోవడంతో ద్విచక్ర వాహనాలు వెళ్లే పరిస్థితి లేదు. దీని కారణంగా నియోజకవర్గ పరిధిలో ఆరు గ్రామాల ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. జాతీయ రహదారి దగ్గర మార్గంగా ఉన్న ఈ రహదారి అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని ఏటిగట్టు తీర ప్రాంత ప్రజలు కోరుతున్నారు. నియోజకవర్గ పరిధిలో ఆచంట, పెనుగొండ మండలాలు మీదుగా 12 కిలోమీటర్లు మేర ఏటిగట్టు రహదారి విస్తరించింది. పెనుగొండ మండలం సిద్ధాంతం వద్ద వున్న దొంగరావిపాలెం నుంచి ఆచంట మండలం భీమలాపురం వరకు ఈ రహదారి మీదుగా ఆరు గ్రామాల ప్రజలు మొదటిలో రాకపోకలు సాగించేవారు. అప్పట్లో ముఖ్యంగా పంట (మిగతా 8వ పేజీలో)





9 లక్షల గాజులతో మావుళ్లమ్మకు అలంకారం

నేడు, రేపు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనం



భీమవరం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : శ్రావణ మాసం శుక్రవారం, వరలక్ష్మి వ్రతం సందర్భంగా మావుళ్ళమ్మకు గాజులతో అలంకరించారు. భక్తులు దాదాపు 9 లక్షల గాజులను అలంకారం నిమిత్తం అందించారు. వచ్చిన గాజులను ప్రత్యేకంగా దండలుగా తయారుచేసి గురువారం రాత్రి నుంచి అలంకారం చేశారు. రంగు రంగుల గాజుల కాంతులతో అమ్మవారు దేదీప్యమానంగా కనిపించారు. ఆలయ ప్రధానార్చకుడు మద్దిరాల మల్లిఖార్జున శర్మ సంప్రోక్షణ కార్యక్రమాలను చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూకట్టారు. ఈవో బుద్ధా మహాలక్ష్మీ నగేష్ ఏర్పాట్లును పర్యవేక్షించారు. శనివారం, ఆదివారం కూడా అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులు దర్శనం ఇవ్వనున్నారు.

రూ.11 లక్షల విలువైన బంగారు పుష్పాలు బహూకరణ

త్వరలో మావుళ్ళమ్మ అమ్మవారికి స్వర్ణ వస్త్రాన్ని పూర్తి చేస్తామని ఎమ్మెల్యే రామాంజనేయులు అన్నారు. అజ్ఞాత భక్తులు సుమారు 11 లక్షల విలువ చేసే 108 బంగారు పుష్పములను అమ్మవారికి బహూకరించారు. అంజిబాబు చేతుల మీదగా ఈవోకు వీటిని అందించారు. అమ్మవారి స్వర్ణ వస్త్ర నిధికి దాతలు ముందుకు వస్తున్నారన్నారు.మరో 25 కేజీలు బంగారం వస్తే వస్త్రం పూర్తి అవుతుందని ఈవో తెలిపారు. పొత్తూర్తి బాపిరాజు, చలమల చంద్రశేఖర్, కోళ్ళ నాగేశ్వరరావు, బొండాడ భూషణం, శ్రీనివాస్, సత్యనారాయణమూర్తి, చిన్ని పాల్గొన్నారు.



గర్భాలయ ద్వారాలకు వెండి తొడుగు

కైకలూరు, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో కల్పిస్తున్న వసతులతోనే భక్తుల సంఖ్య పెరుగు తుం దని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కైకలూరు శ్రీశ్యామలాంబ అమ్మవారి ఆల యానికి 20 మంది దాతల సహకారంతో 16 కేజీల వెండితో అమ్మవారి గర్భాలయ తలు పులకు ఏర్పాటు చేసిన వెండి తొడుగును పూజలు చేసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమన్నారు. కైకలూరుకు చెందిన పిచ్చుకల నాగేశ్వర రావు, పి. పవన్‌కాంత్ 4 కేజీల వెండి సింహాన్ని ఆల యానికి అందించడం అభినందనీయమన్నారు. అలాగే ఆలయంలో కొలువైయున్న శ్రీపార్వతీ సమేత కనకలింగేశ్వర స్వామికి వెండి నాగా భరణాన్ని 4 కేజీలతో భుజబల పట్నానికి చెందిన ఎం. కొండరాజు చేయిస్తారని ఎమ్మెల్యే వెల్లడించారు. తలుపులకు వెండి తొడుగులు అందించిన 20 మంది దాతలను ఎమ్మెల్యే సత్కరించారు. మాజీ ఎమ్మెల్సీ విఠలరావు, ఎంపీపీ అడవి కృష్ణ, కోకన్వీనర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



వెండి తొడుగుకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్



పవిత్రాధివాసంలో భాగంగా పంచగవ్య ప్రోక్షణ జరుపుతున్న అర్చకులు, రుత్వికులు

నేత్రపర్వం..చిన్న వెంకన్న పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని పవిత్రోత్సవాల్లో భాగంగా శుక్ర వారం ఆలయంలో జరిగిన పవి త్రాధి వాసం భక్తజనులకు నేత్రపర్వమైంది. ఉదయం ఆలయంలో విష్వక్సేనపూజ, పుణ్యాహవాచన, అగ్ని ప్రతిష్ఠాపన కార్యక్రమాలను అర్చకులు, రుత్వికులు వైభవంగా జరిపారు. అనం తరం పవిత్రాలకు పంచగవ్య ప్రోక్షణ, అభి మంత్రణలను నిర్వహించారు. ఆ తరువాత ఉత్సవ మూర్తుల వద్ద పవిత్రాలను ఉంచి పంచ శయనాది వాసాన్ని వేదమంత్రోచ్ఛరణలతో అర్చక స్వాములు జరిపారు. అనంతరం మహా శాంతి హోమాలు జరిగాయి. ఆలయంలో చతు ర్వేద పారాయణ నిర్వహించారు.



సరిపల్లెలో వేద పఠనం చేస్తున్న పండితులు

వేదాలను రక్షించుకోవాలి

గణపవరం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): వేదాలు లోక కల్యాణానికి ఉపయోగపడతాయని పలువురు వేదపండితులు అన్నారు. గణపవరం మండలం సరిపల్లెలో టీటీడీ కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న 105వ శాస్త్ర పరిషత్ కార్యక్రమాలు రెండోరోజు శుక్రవారం వేద పరీక్షల్లో వేద విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వేద పండితులు మాట్లాడుతూ వేదాన్ని వ్యాస మహర్షి నాలుగు వేదాలుగా విభజించారని రుగ్వేదం దేవతల గొప్పతనం తెలుపుతుందని, యజుర్వేదం మానవుని పుట్టుక నుంచి మరణం వరకు చేపట్టాల్సిన కర్మలను తెలియజేస్తుందని, అదర్వణ వేదం యాంత్రిక విద్యను తెలుపుతుందని, సామవేదం సంగీత ప్రధానమైందని వివరించారు. మనదేశం ఈ నాలుగు వేదాలతో వేదభూమిగా యజ్ఞ యాగాదులతో కర్మభూమిగా, ధానధర్మాలతో పుణ్యభూమిగా, రుషి పుంగవులతో తపోభూమిగా వర్ధిల్లుతోంది. భారతీయ సనాతన ధర్మానికి వేదమే ప్రమాణం.

వేద పురుషుడు శ్రీమన్నా రాయణుడు, వేద మాత గాయిత్రీదేవి సకల ప్రాణులను రక్షిస్తుంటారు. వేదాలను పఠించే బ్రహ్మణోత్తములను భూలోక దేవతలంటారు. సనాతన ధర్మానికి ప్రతీకలైన వేదాలను రక్షించు కోవడం అటు పాలకులు, ఇటు ప్రజలపైన ఉందని వేద పండితులు స్పష్టం చేశారు. పరీక్షల్లో పాల్గొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఈ నెల 9వ తేదీ శనివారం ఆఖరిరోజు వేదశాస్త్ర పరిషత్ సభలో శ్రీగాయిత్రీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో యోగ్యాత పత్రాలతో సన్మానించి, సత్కరిస్తారు.

ద్వారకాతిరుమల, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : తోబుట్టువుల మధ్య ప్రేమాను రాగాలకు చిహ్నంగా ప్రతీ ఏటా శ్రావణ పౌర్ణమి రోజున రాఖీ పండుగ జరుపుకుంటారు. శనివారం రాఖీ పండుగ సందర్భంగా సోదర, సోదరీమణులు మధ్య ప్రేమ, అనురాగాలకు ప్రతీకగా రాఖీ కడతారు. అనంతరం సోదరుల నుంచి బహుమతులు స్వీకరిస్తారు.రాఖీ కట్టడం వల్ల తమ సోదరుడు తమకు ఎల్లప్పుడూ అండగా ఉంటారని నమ్ముతారు. శక్తి స్వరూపిణిగా వ్యవహరించే ఇంటి ఆడపడుచు చేత రక్షాబంధన చేయిస్తే సోదరులకు దేవతలు సైతం రక్షణగా నిలుస్తారని అరిష్టాలు తొలగిస్తారని విశ్వాసం.

పురాణాలు ఏం చెబుతున్నాయి ?

హిందూ ధర్మంలో ఏమి చెప్పినా దానికి విశేషమైన ఆంతర్యం ఉంటుంది. లక్ష్మీదేవి, చంద్రుడు ఇద్దరూ క్షీరసముద్రం నుంచి ఉద్భవించారు. శ్రావణంలో వరలక్ష్మీదేవిని పూజిస్తాం. శ్రావణ పౌర్ణమి తిథికి చంద్రుడు అధిదేవత. లక్ష్మీదేవికి, చంద్రుడికి మధ్య ఉన్నది సోదర, సోదరీమణుల సంబంధం.. ఒకే కడుపు నుంచి బయటకు వచ్చినవారు శ్రావణ మాసంలో సోదరి తన సోదరునికి రాఖీ కడుతుంది. రాఖీ పండుగ రోజున లక్ష్మీ నారాయణుని పూజించి రాఖీ కడితే శుభ ఫలితాలు దక్కుతాయని పండితులు చెబుతున్నారు.

తోబుట్టువు తోడుగా..



సోదర సోదరీమణుల బంధానికి ప్రతీక రక్షా బంధన్

నేడు రాఖీ పండుగ



ఎన్ని ముడులు వేయాలి ?

రాఖీ పౌర్ణమి రోజున సోదరి తన సోదరునికి రాఖీ కట్టేడప్పుడు మూడు ముడులు మాత్రమే వేయడం శుభప్రదమంటున్నారు పండితులు. అందులో మొదటి ముడి తన సోదరుడి దీర్ఘాయుష్షు ప్రసాదిస్తుందని, రెండోముడి రాఖీ కట్టిన సోదరికి దీర్ఘాయుష్షునందిస్తుందని, ఇక మూడో ముడి వారి అనుబంధంలో మాధుర్యాన్ని పెంచుతుందని నమ్మకం.

రాఖీ ఎప్పుడు కట్టాలి ?

శాస్త్రాల ప్రకారం భద్రకాలంలో రాఖీ కట్టకూడదని పండితులు చెబుతున్నారు. భద్రకాలం ముగిసిని తర్వాతే రాఖీ కట్టాలి. జ్యోతిష్యం ప్రకారం రాఖీ పౌర్ణమి వేళ మూడు శుభయోగాలు ఏర్పడనున్నాయి. సర్వార్థ సిద్ధి యోగం, శోభన్‌యోగం, సౌభాగ్యయోగం వంటివి ఏర్పడతాయని వారు చెబుతున్నారు. ఈ ఏడాది శ్రావణమాసం శుక్లపక్షంలో పౌర్ణమి తిథి ఆగస్టు 8 మధ్యాహ్నం 2.12 ని.లకు ప్రారంభమవుతుంది. మరుసటి రోజైన ఆగస్టు 9న మధ్యాహ్నం గం.1.24లకు ముగుస్తుంది. ఈ నేపథ్యంలో పంచాంగం ప్రకారం భద్రకాలం శనివారం తెల్లవారుజామునే ముగుస్తుంది. సోదరీమణులు రక్షాసూత్రాన్ని తమ సోదరుని మణికట్టుపై శనివారం మధ్యాహ్నం పౌర్ణమి ఘడియలు ముగిసేలోపు ఎప్పుడైనా కట్టొచ్చు. శనివారం ఉదయం 5.47 నుంచి మధ్యాహ్నం గం. 1.24 వరకూ శుభసమయం ఉందని పండితులు చెబుతున్నారు.



భీమవరం జ్యువెలరీ దుకాణంలో



వెండి, బంగారం రాఖీలు

అందుబాటులో ధరలో ఉండటంతో కొనుగోళ్లు

భీమవరం క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం, మరుసటి రోజే రాఖీ పౌర్ణమి కూడా రావడం వల్ల బంగారం మార్కెట్‌లు కళకళలాడాయి. బంగారం దుకాణాలు కొనుగోలు దారులతో సందడి నెలకొంది. ఈ ఏడాది ఇమిటేషన్, వెండి రాఖీలతో పాటుగా బంగారం రాఖీలు కూడా అందుబాటులో ఉండటంతో కొందరు వాటిని కొనుగోలు చేసేందుకు ముందుకు వచ్చారు. రూ. 10 వేల నుంచి రూ. 12 వేలు విలువ చేసే గ్రాములోపు ఉన్న బంగారం రాఖీలు ఎక్కువగా విక్రయించినట్టు వ్యాపారులు చెబుతున్నారు. గత ఏడాది అయితే వెండి రాఖీలు భారీ ఎత్తున కొనుగోలు చేసినప్పటికీ ఈ ఏడాది బంగారం రాఖీలపై కూడా కొందరు శ్రద్ధ చూపిస్తున్నారు. సోదరుడికి ఎంతో ఇష్టంగా ప్రేమతో బంగారంతో కూడిన రాఖీని కడితే ప్రేమ మరింత పెరుగుతుందన్న భావనతో కొందరు మహిళలు చెబుతున్నారు. వెండి రాఖీలు రూ. 700, రూ. 800, రూ. 1000, ఆ పైన ధరలకు విక్రయించారు. భీమవరంలో రాఖీల కొనుగోలు దారులతో శుక్రవారం ఉదయం నుంచి మార్కెట్లు కళకళలాడాయి.

అమ్మకాలు అంతంతమాత్రమే..

ఆన్‌లైన్ మార్కెట్ దెబ్బకు రిటైల్ డల్

భీమవరం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) ఆనందోత్సవాలతో జరుపుకునే రక్షాబంధన్ పండుగలో రాఖీల అమ్మకాలు లేక వ్యాపారాలు తీవ్ర నిరాశ చెందారు. గత కొద్దికాలంగా అమ్మకాల జోరు తగ్గుతూ వస్తోంది. ప్రతీ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా కోట్లాది రూపాయిలు జరిగే రాఖీల వ్యాపారం ప్రస్తుతం లక్షల్లో జరుగుతోంది. ఆన్‌లైన్ వ్యాపారం రావడంతో స్థానిక మార్కెట్‌లో అమ్మకాలు తుగ్గుతూ వస్తున్నాయి. దీంతో పాటుగా స్మార్ట్ ఫోన్లలో ఫొటోలతో తయారు చేసుకుని పంపుకోవటంతో రాఖీల కోనుగోలు తగ్గిపోయిందని వ్యాపారస్తులు చెబుతున్నారు. ఎక్కువగా రూ.5 నుంచి రూ.100 దరలో ఉన్న రాఖీల అమ్మకాలు బాగున్నాయని అంటున్నారు. ఈ సీజన్ లో గురువారం, శుక్రవారం మాత్రమే కొనుగోళ్లు కొంత కనిపిస్తున్నాయని వ్యాపారస్తులు చెబుతున్నారు. గతంలో లక్షల రూపాయల వరకు రాఖీల అమ్మకాలు జరిగేదని ప్రస్తుతం సగం వ్యాపారం జరగలేదని భీమవరం వ్యాపారి ఒకరు చెప్పారు. రాఖీల కొనుగోలులో వెండి రాఖీల అమ్మకాలు కొంత బాగున్నాయని చెబుతున్నారు. రూ. 100 నుంచి రూ.1000 వరకు ఉన్నాయని మామూలు వాటి కంటే వీటి అమ్మకాలు పర్వాలేదని చెబుతున్నారు.



భీమవరంలో రాఖీల విక్రయాలు

భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రత పూజలు

అమ్మవారి ఆలయాలు కిటకిట..

భీమవరం టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : వరలక్ష్మీ వ్రతాన్ని మహిళలు భక్తి శ్రద్ధలతో చేసుకున్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకారం చేసి పూజలు చేసుకున్నారు. కొత్తగా పెళ్ళి చేసుకున్న కోడలితో అత్తింటివారు పుట్టింటిలో శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ పూజను చేయించి బంగారు వస్తువును అందించారు.ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు. అమ్మవారిని 9 రకాల పూలతో అలంకరించడంతో పాటు 9 రకాల పండ్లు, 9 రకాల పిండి వంటలను నివేదించారు. ఇళ్లవద్ద వ్రతాలు చేసి అనంతరం అమ్మవార్ల ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భీమవరం మావుళ్ళమ్మ ఆలయం, శ్రీరాంపురంలోని శ్రీచక్రసహిత కనకదుర్గ అమ్మవారి ఆలయం, ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, గునుపూడి సోమేశ్వరస్వామి ఆలయం, తాడేపల్లిగూడెం బలుసులమ్మ ఆలయాలతో పాటు ఏలూరు జిల్లాలోని కుంకుళ్లమ్మ తదితర అమ్మవారి ఆలయాలు భక్తులతో కిలకిటలాడాయి. భక్తులకు ఇబ్బందులు రాకుండా అధికారులు పర్యవేక్షించారు.





మావుళ్లమ్మ ఆలయం వద్ద భక్తుల క్యూ..

వరలక్ష్మీ వ్రత పూజలు చేస్తున్న మహిళలు



భీమవరం మావుళ్ళమ్మ దేవాలయం వద్ద భారీగా నిలిచిన వాహనాలు

భీమవరంలో ట్రాఫిక్..ట్రాఫిక్..

గంటలకొద్దీ నిలిచిపోయిన వాహనాలు

భీమవరం క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా సాయంత్రం నుంచి ట్రాఫిక్ రద్దీ భారీగా పెరిగింది. ముఖ్యంగా మావుళ్ళమ్మ దేవస్థానం సమీపం నుంచి రెస్ట్‌హౌస్ రోడ్, సింహాద్రి అప్పన్న దేవాలయం రోడ్, వెంకయ్య నాయుడు వీధి, తటవర్తి వారి వీధి, తాడేరు రోడ్డులో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. మావుళ్ళమ్మ దేవాలయానికి వచ్చే భక్తులు కార్లలో వచ్చి కార్లు ఎక్కడ పార్క్ చేయాలో తెలియక అడ్డదిడ్డంగా పెట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. శ్రావణ శుక్రవారం కావడం వల్ల మావుళ్ళమ్మను దర్శించుకునేందుకు జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి కూడా భారీగా భక్తులు వాహనాల్లో వచ్చారు. దీంతో ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ పోలీసులు మాత్రం కనబడకపోవడంతో కొందరు అసహనం వ్యక్తం చేశారు. ఇంత ట్రాఫిక్ ఉన్నా కూడా పోలీసులు క్రమబద్ధీకరించకుండా ఏం చేస్తున్నారంటూ ప్రశ్నలు వెల్లువెత్తాయి. వాహనదారులు అవస్థలు పడ్డారు. దేవాలయం వద్ద మాత్రమే బారికేడ్లు ఏర్పాటు చేసినప్పటికీ దేవాలయం రోడ్డులోకి వెళ్ళే వాహనాలు మలుపు తిరిగేందుకు వీలు లేకపోవడంతో అక్కడ కూడా ట్రాఫిక్ సమస్య పెరిగిపోతున్నది. ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక శ్రద్ధ పెట్టి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాలని పలువురు కోరుతున్నారు.

అడవి దాటని అభివృద్ధి



మారని ఆదివాసీల తలరాతలు

అందని ద్రాక్షగా మెరుగైన వైద్యం

నేటికీ పాకల్లోనే చదువులు..బురద రోడ్లపై పాట్లు

నేడు ఆదివాసీ దినోత్సవం

బుట్టాయగూడెం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందడంతో మానవుడు గ్రహాంతరాలను, భూమండలాన్ని చుట్టేస్తుండగా ఏజెన్సీ ఆదివాసీల తలరాతలు నేటికి మారక పోగా గిరిజన గూడేలు అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్నాయి. అటవీ ఫలాలు, పోడు వ్యవసాయాలపైనే ఆధారపడి ఆదివాసీలు జీవితాలను నెటుకొస్తున్నారు. వ్యవసాయ భూములుండి పంటలు సాగుచేస్తున్న గిరిజనులు అతి తక్కువ మంది ఉండగా అధికులు కూలి పనులపైనే ఆధారపడ్డారు. అన్ని రంగాల్లో వెనుకబడ్డ ఆదివాసీల అభివృద్ధికి ప్రభుత్వాలు చేస్తున్న కృషి అంతంత మాత్రం ఫలితాలనే ఇస్తుందనే వాదనలు లేకపోలేదు. ఫలాలను అందించడంలో అధికారులు, పాలకుల మధ్య చిత్తశుద్ధి కొరవడిందనే విమర్శలు లేకపోలేదు. ఆదివాసీ బిడ్డల బాగోగులు చూడటానికి ఏజెన్సీ కేంద్రంగా కేఆర్ పురంలో 1986లో ఏర్పాటు చేసిన సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) నామమాత్రంగా మారిందనే విమర్శలు వినవస్తున్నాయి. నేడు ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం

అందని ద్రాక్షగానే మెరుగైన వైద్యం

ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ బిడ్డలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షగానే మారింది. సర్కారీ వైద్యంపై చాలామంది ఆదివాసీలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసీలకు మెరుగైన వైద్యం అందించాలని పార్టీలు, ప్రజా,గిరిజన సంఘాలు ఆందోళనలు చేయని రోజు లేదు. అయినా పాలకులకు పట్టదు. వైద్యసేవలను మెరుగుపరచి మెరుగైన వైద్యం అందించడానికి చేపట్టిన ఆసుపత్రుల అభివృద్ధి పనులు నిధుల లేమితో పడకేశాయి. అల్లికాలువ వద్ద కోల్లాది రూపాయల ఖర్చుతో నిర్మాణం చేపట్టిన సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు, బుట్టాయగూడెం, దొరమామిడి ఇతర ప్రాంతాల్లో ఆసుపత్రుల నిర్మాణాల పనులు మందగించాయి.

నేటికి పాకల్లోనే కొనసాగుతున్న విద్య

ఏజెన్సీ ప్రాంతంలో విద్య నేటికీ పాకల్లో కొనసాగుతోంది. పలుచోట్ల నిర్మాణాలు చేపట్టిన భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అనేక ప్రాంతాల్లో భవనాలు పాతబడిపోయి ప్రమాదకరంగా మారాయి. భవనాల పరిస్థితులు ఇలా ఉంటే నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. మోతుగూడెం కాలనీ, లక్ష్మడుగూడెం ఇతర ప్రాంతాల్లోని పాఠశాలలకు భవనాలు మంజూరు కాకపోవడంతో గ్రామస్తులే పాకలను ఏర్పాటు చేసుకుని తరగతులు నడిపించుకుంటున్నారు.

అధ్వానంగా రోడ్ల పరిస్థితి

రోడ్ల సమస్య మన్యం వాసులను వెంటాడుతోంది. అటవీ ప్రాంతాల్లోని అనేక గూడేలకు సరైన రోడ్డు మార్గం లేదు. వర్షాలు కురుస్తున్నందున కొండరెడ్డి గ్రామాలకు వెళ్ళే రోడ్లన్నీ బురదగా మారి ప్రమాదాలను తెచ్చిపెడుతున్నాయంటూ కొండరెడ్లు గగ్గోలు పెడుతున్నారు. అడుగడుగునా గోతుల మయంగా తయారైన బుట్టాయగూడెం-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారికే ఇప్పటివరకు మోక్షం లేదు. అనేక ప్రంతాల్లో కొండవాగులు ఆది వాసీలను ప్రమాదాల భారిన పడేలా చేస్తున్నాయి. అత్యవసరమైన ప్రాంతాల్లో కొండవాగులపై వంతెనలు నిర్మించాలని వేడుకుంటున్నా పాలకుల చెవులకెక్కడం లేదని ఆదివాసీలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఆదివాసీల అభివృద్ధికి కృషి చేయవలసిన ఐటీడీఏ నిధుల లేమితో కొట్టుమిట్టాతుంది. గతంలో విద్య, వైద్యం, వ్యవసాయ సహాయం, వ్యవసాయ పరికరాలు, వ్యక్తిగత యూనిట్లు, రుణాలు, ట్రాక్టర్లు, ఎండ్లబండ్లు, గొర్రెలు, మేకలు, కోళ్ళు, కిరాణా షాపులు, ఇతర దుకాణాలు ఏర్పాటుకు బ్యాంకుల ద్వారా రుణం, ఉన్నత విద్యకు చేయూత, వైద్య ఖర్చులు పలు రకాలుగా ఐటీడీఏ ఆది వాసీలకు అండగా ఉండేది. ఐటీడీఏకు వెళితే తప్పకుండా సహాయం అందుతుందని సుదూర ప్రాంతాల నుంచి గిరిజనులు వచ్చేవారు. నేడు ఐటీడీఏకు వస్తే చార్జీలు దండగ అనేలా ఉందని వాపోతున్నారు.



పొంగుతున్న కొండవాగుల వద్ద జనాలు పడిగాపులు



మోతుగూడెం కాలనీలో పాఠశాల నడిచేది ఈ పాకలోనే..

- **పాలకులకు చిత్తశుద్ధి లేదు**



ఆదివాసీల అభివృద్ధిపైన, సమస్యల పరిష్కారంలో అధికారులకు, పాలకులకు చిత్తశుద్ధి కొరవడింది. ఆదివాసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యాలయాలకు వెళ్ళి వినతిపత్రాలు ఇవ్వడం తప్ప సమస్యలు పరిష్కారం కావడం లేదు. ఇచ్చిన అర్జీలన్నీ ఏమైపోతున్నాయో తెలియడం లేదు. జీవో నెం.3 పునరుద్ధరణకు కృషి చేయాలని, చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆందోళన చేసినా కదలిక లేదు.

పి.శ్రీనివాస్, న్యూడెమోక్రసీ నాయకుడు

- **పోరాటాలు చేసినా స్పందన కరువు**



ఏజెన్సీలో అధికారులు, నేతలు ఉన్నా లేనట్టుగానే ఉంది. పార్టీలు, ప్రజా సంఘాల తరపున పలుమార్లు సమస్యలపై అధికారులకు విన్నవించినా పరిష్కారం అందని ద్రాక్షగానే ఉంది. విద్య, వైద్యం, రోడ్లు, భూములు, పట్టాలు, గిరిజన చట్టాలు, హక్కుల కోసం పోరాటాలు చేస్తూనే ఉన్నాం. ప్రత్యేక డీఎస్సీ కోసం ధర్నాలు, ర్యాలీలు ఆందోళనలు చేసినా స్పందన లేదు.

తెల్లం రామకృష్ణ, సీపీఎం నాయకుడు

విద్యుత్ అదనపు లోడుకు రాయితీతో అవకాశం

డిసెంబరు నెలాఖరు వరకు గడువు పెంపు

భీమవరంటౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారులకు ఏపీఈపీ డీసీఎల్ మరో అవకాశాన్ని ఇచ్చింది. మరో 4 నెలలపాటు రాయితీతో అదనపు లోడు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.గత మార్చి నెల నుంచి జూన్ నెలాఖరువరకు గతంలో అవకాశం ఇచ్చినా అనుకున్నంత స్పందన రాకపోవడంతో మరో అవకాశం కల్పించింది. దరఖాస్తు చేసుకుంటే కిలోవాట్‌కు 2,250 రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. ఐతే ఈ రాయితీ పథకంలో దరఖాస్తు చేసుకుంటే రూ.1250 చెల్లిస్తే సరిపోతుంది. పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 3,596 మంది అదనపు లోడు కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో కూడా ఇంచుమించు ఇదే సంఖ్యలో దరఖాస్తులు వచ్చినట్టు తెలుస్తోంది.

అదనపు లోడు వివరాలు ఇవీ

కిలో వాట్స్	అసలుధర	రాయితీ
కిలో వాట్‌కు	2250	1250
2 కిలోవాట్లకు	4450	2450
3 కిలోవాట్‌కు	6650	3650
4 కిలోవాట్‌కు	8850	4850
5 కిలోవాట్‌కు	11050	6050



తణుకు ఎస్‌కెఎస్‌డీ కళాశాలలో ఖోఖో ఆడుతున్న క్రీడాకారులు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికలు

తణుకు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి క్రీడా దినోత్సవంలో భాగంగా జిల్లాస్థాయి ఎంపికలను శుక్రవారం ఎస్‌కెఎస్‌డీ మహిళా కళాశాలలో నిర్వ హించారు. కబడ్డీ 12 మంది, ఖోఖో 15 మంది, వాలీబాల్ 12 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఆయా టీమ్‌ల నుంచి 70 క్రీడాకారులను ఎంపిక చేసినట్లు జిల్లా స్పోర్ట్స్ డవలప్‌మెంట్ ఆఫీసర్ మల్లి రాజేష్ చెప్పారు. జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. కూటమి నాయకులు వావిలాల సరళాదేవి, బొల్లా నాగరాజు తదితరులు పరిశీలించారు.



ఆకలి పోరాటం..!

ఊరూ పేరు లేని అభాగ్య జీవితాలు వారివి.. కడుపు నింపుకునేందుకు వారికి తెలిసిన పని ఇదొక్కటే.. మనం తిని పారేసిన చెత్తలో వారు జీవనాన్ని వెతుక్కుంటున్నారు.. రోడ్లపై చెత్తా చెదారాల్లో ప్లాస్టిక్ బాటిళ్ల, కాగితాలు ఏరుకుని వాటిని అమ్ముకుని పొట్టపోసుకుంటుంటారు సంచార జీవులు.. మోకాళ్ళ లోతు డ్రెయినేజీలో దిగి చేతులతో ఏదైనా దొరుకుతుందేమోనని తడుముతూ వెతుకులాడడం చూస్తుంటే ఛీ..ఛీ అంటూ అసహ్యంచుకునేవారే ఎక్కువ.. కానీ వారిది ఆకలి పోరాటం.. గుప్పెడు మెతుకుల కోసం నిత్యం వారు చేసే సాహస కృత్యం.. పెనుగొండలోని రాజుగూడెం శివారులో ఉన్న డ్రెయినేజీలో ఇదిగో ఇలా ఇద్దరు మహిళలు ఆ రోజు పొట్ట పోసుకునేందుకు బతుకు పోరాటం చేస్తున్నారు..



-పెనుగొండ(ఆంధ్రజ్యోతి)



శిథిలావస్థలో ఉన్న పెంకుటింట్లో ఆర్అండ్‌బీ ఏఈ కార్యాలయం

ఇదీ.. ఒక కార్యాలయమే..!

పెంటపాడు ఆర్అండ్‌బీ కార్యాలయానికి కష్టమెచ్చింది. ఎప్పుడు పడిపోతుందో తెలియని శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లే కార్యాలయానికి ప్రస్తుత చిరునామా.. పట్టణంలోని ట్రావెలర్స్ బంగళాలలో ఆర్డీవో, ఆర్అండ్‌బీ డీఈ కార్యాలయాలకు మంచి భవనాలే కేటాయించారు. కానీ అర్అండ్‌బీ ఏఈ కార్యాలయానికి మాత్రం శిథిలావస్థలో ఉన్న పెంకుటిల్లు ఇచ్చారు. ఈ పెంకుటింటి భవనం పైకప్పు రెండు భాగాలుగా చీలిపోయింది. ఎప్పుడు పడిపోతుందో కూడా తెలియని పరిస్థితి. ఉద్యోగులు కూడా బిక్కుబిక్కు మంటూ విధులు నిర్వహిస్తున్నారు. పని నిమిత్తం వెళ్ళే ప్రజలు, కాంట్రాక్టర్లు కూడా ఈ కార్యాలయాన్ని చూసి భయపడుతున్నారు. అధికారులు స్పందించి మంచి భవనం కేటాయించాలని కోరుతున్నారు.

- పెంటపాడు (ఆంధ్రజ్యోతి)

నేడు ఏపీ నిట్ స్నాతకోత్సవం

ప్రతిభావంతులకు బంగారు పతకాలు .. విద్యార్థులకు డిగ్రీ పట్టాల ప్రదానం



తాడేపల్లిగూడెం అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్ 7వ స్నాతకోత్సవానికి సిద్ధమైంది. శనివారం ఉదయం 10 గంటల నుంచి నిట్ ప్రాంగణంలోని రవీంద్రభారతి ఆడిటోరియంలో ఈ వేడుకను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. పట్టణంలో ఏపీ నిట్‌ను 2015 లో ఏర్పాటు చేయగా ఇప్పటివరకు నాలుగేళ్ల ఇంజనీరింగ్ కోర్సులను ఏడు బ్యాచ్‌ల విద్యార్థులు పూర్తి చేసుకున్నారు. ప్రస్తుతం 2021-25 బ్యాచ్‌కు చెందిన 667 మంది విద్యార్థులు ఏపీ నిట్‌లో డిగ్రీలను తీసుకోనున్నారు. వీరితో పాటూ పీహెచ్‌డీ పూర్తి చేసిన 29 మంది పరిశోధక విద్యార్థులకు డాక్టరేట్ పట్టాలను అందజేయనున్నారు. సంస్థలో మొత్తం 8 కోర్సులను నిర్వహిస్తుండగా ఆయా కోర్సుల్లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన ఒక్కొక్క విద్యార్థికి ఇనిస్టిట్యూట్ తరపున బంగారు పతకాన్ని ప్రదానం చేయనున్నారు.

ముఖ్యఅతిథి టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్

ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ ప్రెసిడెంట్ వి.రాజన్న హాజరు కానున్నారు. వేడుకలను సంబంధించిన ఏర్పాట్లను నిట్ అకడమిక్ డీన్ డాక్టర్ జయరాం పర్యవేక్షిస్తున్నారు.

బంగారు పతకాలు వీరికే..

కోర్సుల వారీగా అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన విద్యార్థులు బంగారు పతకాలను అందుకోనున్నారు. బయో టెక్నాలజీ ఇంజనీరింగ్ నుంచి శశాంక్ (9.33 గ్రేడ్ పాయింట్లు), కెమికల్ ఇంజనీరింగ్ నుంచి సంగెపు అభినవ్ (8.82), సివిల్ ఇంజనీరింగ్ నుంచి తమ్ము హరిత (9.44), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నుంచి కలిదిండి పవన్ తేజ సత్యవర్మ (9.70), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ నుంచి ఆదిత్య ప్రతాప్ సింగ్ (9.42), ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ నుంచి చిత్తిడి ధనూషా లక్ష్మి దుర్గ (9.48), మెకానికల్ ఇంజనీరింగ్ నుంచి వుడుముడి ప్రియాంక (9.33), మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్ నుండి జయస్మిత కే ప్రధాన్ 9.07 గ్రేడ్ పాయింట్లు సాధించారు. వీరంతా నేడు జరిగే స్నాతకోత్సవంలో బంగారు పతకాలను అందుకోనున్నారు. బ్యాచ్‌లో అత్యధిక గ్రేడ్ పాయింట్లు సాధించిన పవన్ తేజ సత్యవర్మ ఇనిస్టిట్యూట్ తరపున, కోర్సు వారీగా రెండు బంగారు పతకాలను అందుకోనున్నారు. ప్రస్తుతం విద్యార్థులకు అందించే ప్రశంసా పత్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు

నిర్బంధంగా 'విద్యా శక్తి' తగదు

ఏలూరు రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): విద్యా శక్తి కార్యక్రమాన్ని నిర్బంధం చేయడం తగదని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు అన్నారు. ఏలూరులో జరిగిన సంఘ జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు స్టీవెన్‌తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాశక్తి కార్యక్రమం ఐచ్ఛికంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ తెలిజేశారని, కానీ కొన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్బంధంగా నిర్వహించమనడం సబబు కాదన్నారు. సాధారణంగా విద్యార్థులు సాయంత్రం నాలుగు గంటలకు మానసికంగా అలసిపోతారని, ఆ సమయంలో విద్యాశక్తి అని అదనంగా తరగతులు నిర్వహించడం వల్ల ప్రయోజనం ఉండదన్నారు. ఉపాధ్యాయులకు యాప్‌ల భారంతో పాటు బోధనేతర కార్యక్రమాలు భారం తగ్గించి బోధనకు మాత్రమే పరిమితం చేస్తేనే మంచి ఫలితాలుంటాయన్నారు. అకడమిక్ ఫోరంలు తప్పనిసరయితే సీనియర్ ఉపాధ్యాయులను ఎంపిక చేయాలన్నారు. అసెస్మెంట్ బుక్స్‌లో మార్కులు ఎందుకు వేశారో కారణాలు రాయమనడం విడ్డూరమన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటై ఏడాది దాటినా పీఆర్సీ డీఏల ఊసెత్తకపోవడం సరికాదన్నారు. ఏలూరు జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ అధ్యక్షత వహించారు.



నూజివీడు నియోజకవర్గ మ్యాప్

ముక్కలైన డివిజన్.. ఒక్కటి కానుందా?

» జిల్లా మార్పునకు శ్రీకారంపై ప్రజల్లో హర్షం » నూజివీడు వాసుల్లో చిగురిస్తున్న ఆశలు

వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లాల మార్పులు, చేర్పులతో రాష్ట్రంలో అనేక జిల్లాల వాసులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనాలోచిత చర్యల వల్ల సుదీర్ఘకాలం నుంచి ఉన్న డివిజన్‌లు సైతం కుంచించుకుపోవడం, కొన్ని నియోజకవర్గాల్లోని ప్రభుత్వ కార్యాలయాలు తరలివెళ్లిపోయి డివిజన్, నియోజకవర్గాల ప్రాధాన్యం తగ్గిపోయింది. అలా ప్రాధాన్యత కోల్పోయిన డివిజన్ నియోజక వర్గాల్లో నూజివీడు ఒకటి.

(ఆంధ్రజ్యోతి - నూజివీడు)

ఉమ్మడి కృష్ణా జిల్లాలో నూజివీడు ఉన్నప్పుడు కృష్ణా జిల్లాలోని 14 మండలాలతో అతిపెద్ద డివిజన్‌గా నూజివీడు ఉండేది. మరోవైపు ఉమ్మడి కృష్ణా జిల్లాలో దాదాపు మధ్యస్తంగా ఉండడంతో డివిజన్‌కు అత్యధిక ప్రాధాన్యం లభించేది.

మూడు ముక్కలైన నూజివీడు డివిజన్

జిల్లాల విభజనతో 14 మండలాలతో ఉన్న నూజివీడు డివిజన్ దాదాపు మూడుముక్కలు అయింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల్లో పూర్వపు నూజివీడు డివిజన్‌లోని మండలాలు కలిశాయి. పూర్వపు డివిజన్‌లో నూజివీడు నియోజకవర్గంలో గల నాలుగు మండలాలు ఏలూరు జిల్లా కేంద్రంగా ఉన్న నూజివీడు డివిజన్‌లో ఉండగా, మిగిలిన పది మండలాల్లోని కొన్నింటిని ఎన్టీఆర్ జిల్లా పరిధిలో తిరువూరు డివిజన్‌ను ఏర్పాటు చేయగా, మరికొన్నింటిని గుడివాడ డివిజన్‌లో విలీనం చేశారు.

నాలుగు మండలాలతో కుదేలు

గత ప్రభుత్వం నిర్దయం వల్ల 14 మండలాల నూజివీడు డివిజన్ నాలుగు మండలాలకు కుదించబడింది. దీంతో సేల్స్ ట్యాక్స్ కార్యాలయం, ఉద్యానవన పంటలకు కేంద్రంగా ఉన్న నూజివీడు నుంచి ఉద్యానవన సహాయ సంచాలకుల కార్యాలయం, పౌర సంబంధాల శాఖ కార్యాలయాలు ఏలూరుకు తరలాయి. ఈ పరిస్థితుల్లో నూజివీడు డీఎస్పీ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయాలు సైతం నిబంధనల ప్రకారం తరలిపోయే ప్రమాదం పొంచి ఉండడంతో నాటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అప్పటి సీఎం జగన్‌ను కలిసి విన్నవించడంతో నాడు పశ్చిమగోదావరి జిల్లాలోని చింతలపూడి, లింగపాలెం మండలాలను నూజివీడు డివిజన్‌కు కలపడంతో పాటు పెదపాడు, పెదవేగి మండలాలను నూజివీడు పోలీస్ డివిజన్‌లో కలిపారు. ఆయా మండల వాసులకు నూజివీడులో కలవడం ఇబ్బందికరంగా మారింది. నూజివీడు రెవెన్యూ డివిజన్ 6 మండలాలైంది. నూజివీడు ఉమ్మడి కృష్ణా జిల్లాలో ఉన్నప్పుడు డివిజన్ మెట్ట ప్రాంతం కావడంతో జిల్లాలో ప్రాధాన్యం ఉండేది. నూజివీడు ఏలూరు జిల్లాలో కలపడం వల్ల ఆ జిల్లాలో ఒక మారుమూల ప్రాంతంగా ఉండడం, అప్పటికే ఆ జిల్లాలో మెట్ట ప్రాంతంగా ఉన్న జంగారెడ్డిగూడెంకు ఉన్న ప్రాధాన్యం నూజివీడుకు లేదనే చెప్పాలి.

సీఆర్‌డీఏపై కక్షతోనే..

జగన్ ప్రభుత్వం సీఆర్‌డీఏ పరిధిలో చుట్టూ ఉన్న డివిజన్‌లను, జిల్లాలు మార్చి సీఆర్‌డీఏని దెబ్బతీసే భాగంలోనే నూజివీడును ఏలూరు జిల్లాలో కలిపారనేది నగ్నసత్యం. ఇప్పుడు నూజివీడు నియోజకవర్గం సీఆర్‌డీఏలో ఉంది. అవుటర్ రింగ్ రోడ్డు నియోజకవర్గ పరిధిలోని ఆగిరిపల్లి మండలం నుంచి వెళుతోంది. అవుటర్ రింగ్ రోడ్డు పూర్తయితే నియోజకవర్గం అభివృద్ధికి బాటలు పడినట్లే.

రెండు సార్లు బాబు హామీ

చంద్రబాబు ప్రతిపక్షనేతగా నూజివీడు రెండుసార్లు వచ్చారు. వచ్చిన ప్రతిసారి నియోజకవర్గ ప్రజలు తమ నియోజకవర్గాన్ని కృష్ణా జిల్లాలో కలపాలని చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల హామీగా ఆయన ఎన్నికల ప్రచార సభకు వచ్చినప్పుడు చంద్రబాబు సభాముఖంగా విజయవాడ జిల్లా కేంద్రంగా ఉన్న జిల్లాలో నూజివీడును చేర్చుతానని హామీ ఇచ్చారు. సీఎం అయిన తర్వాత ఆగిరిపల్లి పీ-4 కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఆయన దృష్టికి ప్రజలు ఈ విషయాన్ని మరోసారి తీసుకురాగా తనకు గుర్తు ఉందంటూ ఆయన పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలు, డివిజన్ కేంద్రాలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని వేయడం, ఎంతవరకు వచ్చిందని బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అడగడం, నెల రోజులలో దీనిపై నివేదిక ఇవ్వాలని డిసెంబరు నాటికి సమస్యకు పరిష్కారమయ్యేలా చర్యలు ఉండాలని ముఖ్యమంత్రి స్పష్టం చేయడంతో నూజివీడు నియోజక వర్గంలో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం స్వాధీనం

ద్వారకాతిరుమల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు అందాల్సిన రేషన్‌బియ్యాన్ని అక్రమార్కులు పక్కదారిపట్టిస్తున్నారు. మండలంలోని జి.కొత్తపల్లిలోని ఓ ఇంట్లో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచినట్టు సమాచారం అందుకున్న రెవెన్యూ అధికారులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. తరలింపునకు సిద్ధంగా ఉన్న అక్రమ రేషన్ బియ్యాన్ని రెవెన్యూ, పోలీసు యంత్రాంగం పట్టుకుని సీజ్ చేసింది. మండలంలోని జి.కొత్తపల్లిలో మాటూరి దుర్గయ్య అనేవ్యక్తి దాసరి రాజు ఇంట్లో గదిని అద్దెకు తీసుకుని అందులో 3,750 కేజీల రేషన్ బియ్యాన్ని నిల్వ చేశాడు. గ్రామాల్లో లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వచేసి వాటిని అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈక్రమంలో కొత్తపల్లిలో దీనిని తరలించేందుకు ప్రయత్నాలు చేస్తుండటంతో సివిల్ సప్లై డిప్యూటీ తహసీల్దారు తాళ్లూరి నాగరాజు, జంగారెడ్డిగూడెం డీటీ వెంకటేశ్వరరావు, స్థానిక పోలీసులు పట్టుకున్నారు. దుర్గారావుపై కేసు నమోదు చేసినట్టు అధికారులు వెల్లడించారు.

గడ్డివాము దగ్ధం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి గడ్డివాము దగ్ధం కావడంతో రైతులిచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోణంగి గ్రామానికి చెందిన జలసూత్రం సోమేశ్వరరావు తన రెండెకరాల పొలంలోని వరి గడ్డిని గడ్డివాముగా వేశారు. శుక్రవారం తెల్లవారు జామున గుర్తుతెలియని వ్యక్తులు గడ్డివాముకు నిప్పుపెట్టారు. ఈ సంఘటనపై సోమేశ్వరరావు ఫిర్యాదు చేయడంతో రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

మద్యం మత్తులో పొడుచుకున్నాడు..

ఏలూరు క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ వ్యక్తి బీరు సీసాతో గాయపరుచుకున్నాడు. పత్తేబాదకు చెందిన అరుణ్ కుమార్ వంట మేస్త్రిగా పనిచేస్తున్నాడు. ఈ నెల 7న మద్యం మత్తులో బీరు సీసాతో పొడుచుకున్నాడు. స్థానికులు గుర్తించి సర్వజన ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించగా చికిత్స పొందుతున్నాడు. దీనిపై టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రొయ్యలు కొనుగోలు చేసి మోసం

భీమవరం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తనవద్ద రొయ్యలు కొనుగోలు చేసి డబ్బులివ్వకుండా ఇద్దరు మోసం చేశారంటూ లిఖిత మెరైన్ ఫుడ్స్ అండ్ ఎల్ఎన్ఆర్ మెరైన్ ఫుడ్ సంస్థల మేనేజింగ్ పార్టనర్ లింగం నాగేశ్వరరావు వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. నాగేశ్వరరావు చుట్టుపక్కల ప్రాంతాల్లో రైతుల నుంచి రొయ్యలు కొనుగోలు చేసి వాటిని ఐస్ ప్యాకింగ్ చేసి ఎక్స్‌పోర్ట్ చేస్తుంటారు. ఇదిలా ఉండగా 2024లో గోవా రాష్ట్రానికి చెందిన మేనేజింగ్ డైరెక్టర్ రాజేంద్ర సింగ్ జారి, డైరెక్టర్ పీయూష్ రాజేంద్ర సింగ్ జారి భీమవరం వచ్చి లింగం నాగేశ్వరరావు నుంచి రొయ్యలు అరువుకి కొనుగోలు చేశారు. విదేశాలకు విక్రయిస్తామంటూ నమ్మించి 2024-25 సంవత్సరం మధ్యకాలంలో మూడు దఫాలుగా కోటి 35 లక్షల 34 వేల 907 రూపాయల విలువైన రొయ్యలు కొనుగోలు చేశారని అన్నారు. అరువు కావడంతో వడ్డీతో సహా చెల్లిస్తామని నమ్మబలికి ఇప్పటి వరకు డబ్బులు చెల్లించకుండా మోసం చేసినట్లు ఫిర్యాదు చేశారు. దీనిపై సీఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కట్నం కోసం వేధిస్తున్నవారిపై కేసు

భీమవరం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తన భర్త తరపు బంధువులు అదనపు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారంటూ భీమవరం పట్టణానికి చెందిన గోడి అనిత వన్‌టౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అనితకు సుమారు ఆరేళ్ల క్రితం రాజమహేంద్రవరం మండలం మారెంపూడి గ్రామానికి చెందిన జాషువా జయకుమార్‌తో వివాహం జరిగింది. వివాహ సమయంలో రూ.5 లక్షల నగదు, బంగారం కట్నంగా ఇచ్చారు. కొంత కాలం బాగానే ఉన్నారని ఆ తర్వాత జాషువా జయ కుమార్, అతని బంధువులు రూ.10 లక్షలు అదనంగా కట్నం తీసుకురమ్మని మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నట్టు ఫిర్యాదు చేసింది. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిరణ్ కుమార్ తెలిపారు.

ఆయిల్‌పాం గెలలు కోస్తూ కూలీ మృతి



రమేశ్ మృతదేహం

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తాడువాయి పంచాయతీ పరిధిలోని గొల్లగూడెంలో ఓ రైతు పొలంలో ఆయిల్‌పాం గెలలు కోయడానికి వెళ్లిన తడికమళ్ళ రమేష్(35) విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. జీలుగుమిల్లి మండలం స్వర్ణవారిగూడెం గ్రామానికి చెందిన రమేష్ కూలీ పనులు చేసుకుంటూ భార్య, కుమార్తెను పోషించుకుంటున్నాడు. జంగారెడ్డిగూడెం మండలం గొల్లగూడెం లో వీరంకి శ్రీనివాసరావుకు చెందిన ఆయిల్‌పాం తోటను కొప్పుల శ్రీనివాసరావు కౌలుకు తీసుకున్నారు. శుక్రవారం రమేశ్‌ను కొప్పుల శ్రీనివాసరావు ఆయిల్‌పాం గెలలు కోయడానికి కూలికి పిలిచాడు. రమేశ్ గెలలు కోస్తుండగా కత్తి విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య చుక్కమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్.ఐ. జబీర్ తెలిపారు.

రిటైర్డ్ మిలటరీ ఉద్యోగిపై చీటింగ్ కేసు

● ఉద్యోగాలు ఇప్పిస్తానని రూ.49.50 లక్షలు స్వాహా

ఏలూరు క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఒక రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఒక మహిళను పరిచయం చేసుకుని ఆమె ద్వారా బంధువుల వద్ద లక్షలాది రూపాయలు తీసుకుని ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేశాడు. దీంతో ఆ మహిళ, బాధితులు కలిసి ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఫిర్యాదు చేయడంతో టూటౌన్ సీఐ కె.అశోక్ కుమార్ కేసు నమోదు చేశారు. ఏలూరు ఆర్ఆర్ పేటకు చెందిన సాలమూరి వెంకట నాగ శ్రీలక్ష్మి గృహిణిగా ఉంటూ తన కుటుంబంతో జీవిస్తుంది. ఆమె సోదరుడి ద్వారా తాడేపల్లిగూడేనికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి జాలాది రామచంద్రరావు పరిచయమయ్యాడు. తనకు మంత్రులు తెలుసని అనేక శాఖల ఉన్నతాధికారులు తెలుసునని నమ్మబలికి ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పాడు. శ్రీలక్ష్మి తన కుటుంబ సభ్యులతో పాటు తన బంధువుల్లో ఉన్న నిరుద్యోగ యువతకు పరిచయం చేయడంతో వారి నుంచి రూ.49 లక్షల 50 వేలు 2023 నుంచి ఇప్పటి వరకూ తీసుకున్నాడు. ఏ ఒక్కరికీ ఉద్యోగం ఇవ్వలేదు. మాయమాటలు చెప్తూ కాలయాపన చేస్తున్నాడు. దీంతో నాగ శ్రీలక్ష్మి బాధితులు కలిసి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శుక్రవారం రాత్రి రామచంద్రరావుపై చీటింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాములదిబ్బ ప్రాంతంలో ఇల్లు దహనం

● పాత కక్షల నేపథ్యంలో ఉద్రిక్తత, రంగంలోకి దిగిన పోలీసులు



ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): ఏలూరు పాములదిబ్బలో మరోసారి ఉద్రిక్తత చోటు చేసుకుంది. రెండు నెలల క్రితం పాములదిబ్బకు చెందిన ముంగి యర్రబాబు హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అదే ప్రాంతానికి చెందిన కొందరు నిందితులుగా ఉండడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఆ సమయంలోనే బాధిత కుటుంబ సభ్యులు నిందితుల ఇంట్లో సామగ్రి ధ్వంసం చేసి హడావుడి చేయడంతో అప్పట్లో పోలీసులు పికెట్ ఏర్పాటు చేసి శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా డీఎస్పీ శ్రావణ్‌కుమార్ చర్యలు చేపట్టారు. అప్పట్లో విషయం సర్దుమణిగినా నివురు గప్పిన నిప్పులా రాచుకుంటూ ఉంది. క్రమంలోనే శుక్రవారం తెల్లవారు జామున హత్య కేసులో నిందితుడిగా ఉన్న దాసరి కుమార్ రాజ్ ఇంటికి నిప్పు పెట్టారు. దీంతో మళ్లీ పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపుచేశారు. శాంతి భద్రతలు గాడితప్పకుండా టూటౌన్ సీఐ అశోక్ కుమార్ పాములదిబ్బలో మళ్లీ పోలీసు భద్రతను ఏర్పాటు చేశారు. ఇంటికి నిప్పు పెట్టిన ఘటనకు సంబంధించి హత్యకు గురైన యర్రబాబు తల్లి పెద్దింట్లుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నారాయణపురంలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి గాయాలు

ఉంగుటూరు ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):జాతీయ రహదారిపై ఉంగుటూరు మండలం నారాయణపురం వద్ద రోడ్డు దాటుతున్న వ్యక్తిని మోటార్ సైకిల్ ఢీ కొనడంతో మోటార్ సైక్లిస్టుతో పాటు పాదచారి గాయపడ్డాడు. హైవే అంబులెన్స్ సిబ్బంది వివరాల ప్రకారం నారాయణపురంలో మెకానిక్ షెడ్డులో పని చేస్తున్న కైకరం గ్రామానికి చెందిన కోనే పవన్ మోటారు సైకిల్‌పై వేగంగా వెళ్తూ రోడ్డు దాటుతున్న వేముల ఉమామహేశ్వరరావును ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ గాయపడ్డారు. వైద్యం నిమిత్తం వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ప్రమాద ఘటనా స్థలంలో షంషేర్ మృతదేహం

యాసిడ్‌తో వెళ్తున్న ఆటో బోల్తా.. మహిళ మృతి

పెదపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):ట్రక్కు ఆటోలో యాసిడ్ తీసుకొస్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తా పడిన ఘటనలో మహిళ మృతి చెందగా, మరోకరికి తీవ్రగాయాలయ్యాయి.పెదపాడు మండలం తాళ్లమూడి వద్ద జాతీయ రహదారిపై ఈ ఘటన జరిగింది. గుంటూరుకు చెందిన షేక్ అల్లాబక్ష్, అతని భార్య బేగ్ షంషేర్(45)లు తమ ప్రాంతంలో యాసిడ్ కొనుగోలు చేసి తిరిగి ఏలూరులో అమ్మకాలు చేస్తుంటారు. ఇదేక్రమంలో శుక్రవారం గుంటూరులో యాసిడ్ కొనుగోలు చేసి దానిని డబ్బాల్లో నింపుకుని ట్రక్కు ఆటోలో పెట్టుకుని ఏలూరుకు బయల్దేరారు. ఆటో తాళ్ళమూడి వద్దకు వచ్చేసరికి టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తా పడింది. దీంతో క్యాబిన్‌లో ఉన్న భార్య, భర్తలిద్దరిపై యాసిడ్ పడింది. దీంతో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన ఎస్.ఐ. కట్టా శారదా సతీష్ దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య



భీమవరం క్రైం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో జంక్షన్ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫాం నెంబర్ 2లో నరసాపురం నుంచి లింగంపల్లి వెళ్లే రైలు కింద సుమారు 55సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి తల పట్టాలపై పెట్టి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న రైల్వే జీఆర్‌పీ ఎస్ఐ సుబ్రహ్మణ్యం అక్కడికి చేరుకుని పరిశీలించారు. వివరాలు తెలిస్తే 97056 49492 నెంబర్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు.

ఆత్మహత్య చేసుకుంటానన్న వ్యక్తికి కౌన్సెలింగ్

కైకలూరు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగాలేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకుంటున్నానని బంధువులకు చెప్పడంతో 112 కు కాల్ చేసి సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అలర్ట్ అయ్యి సంబంధిత వ్యక్తిని శుక్రవారం అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు. కైకలూరు టౌన్ ఎస్.ఐ. ఆర్.శ్రీను తెలిపిన వివరాల ప్రకారం ఏలూరు జిల్లా భీమడోలు మండలం తడికలపూడికి చెందిన అందుగల థామస్ కారు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భీమవరం కిరాయికి వచ్చి వరుసకు సోదరుడైన రత్నారావుకు ఫోన్ చేసి ఇంటి వద్ద గొడవలు జరుగుతున్నాయని, అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్టు చెప్పాడు. వెంటనే రత్నారావు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో భీమవరం, ఉండి, ఆకివీడు పోలీసులు అప్రమత్తమయ్యారు. హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు భీమవరం నుంచి కైకలూరు వచ్చే బస్సులో థామస్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.దీంతో కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి వారికి అప్పగించినట్లు ఎస్.ఐ. తెలిపారు.

పేదలకు అండగా కూటమి ప్రభుత్వం



తాడేపల్లిగూడెం రూరల్: పేదలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని టీడీపీ తాడేపల్లిగూడెం మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ పేర్కొన్నారు. ఎల్.అగ్రహారం వద్ద ఎన్టీఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో టిడ్కో ఇళ్ల వద్ద పేదలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పటాన్ వల్లి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యండగండి సహకార బ్యాంక్ చైర్మన్‌గా మంతెన రవివర్మ



ఉండి, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):యండగండి సహకార బ్యాంక్ చైర్మన్‌గా మంతెన రవివర్మను ప్రకటించారు. ఆయన టీడీపీ గ్రామ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. సభ్యులుగా ఉబుదురు టీడీపీ గ్రామ అధ్యక్షుడు బంగారు వీరరామవులు, కొరుకొల్లుకు చెందిన అన్నెపు అప్పారావులను నియమించారు. ఈ సందర్భంగా ఆయన డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి దేశభక్తిపై జిల్లాస్థాయి పోటీలు



పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించిన దృశ్యం

భీమవరంటౌన్ ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా ఈనెల 9 నుంచి 13 వ తేదీ వరకు దేశ భక్తిని ప్రేరేపించేలా జిల్లా స్థాయిలో పోటీలను నిర్వహిస్తున్నామని శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి తెలిపారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశభక్తిని అన్ని వర్గాల్లో ప్రేరేపించేలా జిల్లాస్థాయిలో మహిళ సంఘాలు, విద్యార్థులకు, మెప్మా మహిళలకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలను నిర్వహిస్తామని తెలిపారు 11,12,13వ తేదీల్లో పాఠశాల, కళాశాల విద్యార్థులకు పోటీలు జరుగుతాయని, గెలుపొందిన వారికి 17న జరిగే ముగింపు వేడుకల్లో బహుమతులను అందజేస్తామన్నారు. మరెన్ని వివరాలకు 99123 22269కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రహ్మణ్యం, భట్టిప్రోలు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కార్మికుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ నేత రాజు

'పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ తాడేపల్లిగూడెం ఏరియా అధ్యక్షుడు ఓవీ రాజు పేర్కొన్నారు. శుక్రవారం జగన్నాథపురంలో పంచాయతీ కార్మికుల సమావేశం మండల అధ్యక్షుడు తాడేపల్లి సుబ్బరాజు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కోశాధికారి తాడికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు వీక్లీ ఆఫ్‌తోపాటు, కనీస వేతనం, ఈఎస్ఐ, పీఎఫ్ వంటివి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి ఎం.హరీశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కళింగ లక్ష్మణరావు పాల్గొన్నారు.

'మోతాదుకు మించి ఎరువులు వాడొద్దు'



శిక్షణలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఉషారాణి

తాడేపల్లిగూడెం రూరల్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి ఎరువుల వినియోగించడం వల్ల పంట భూమి కలుషితం కావడంతో పాటు అనవసర పెట్టుబడి పెరుగుతుందని రాజమండ్రి వ్యవసాయ కళాశాల హెడ్ ప్రొఫెసర్ పి.ఉషారాణి సూచించారు. వెంకట్రామన్నగూడెంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ ఆవరణలో కేవీకే వద్ద ఫ్యాక్స్ వారి ఆర్థిక సాయంతో నిర్వహిస్తున్న సమగ్ర పోషక యాజమాన్యంపై 15 రోజుల శిక్షణ కార్యక్రమం మూడో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరపతి సంఘ సిబ్బందికి పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త పెద్దబాబు, ఫ్యాక్స్ సభ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా విశ్వేశ్వరరావు



అధ్యక్ష, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన విశ్వేశ్వరరావు, నాగేశ్వరరావు

నరసాపురం, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) :బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బూసి విశ్వేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నామినేషన్ల ఉపసంహరణకు తుది గడువు. అధ్యక్షుడి రేసులో ఉన్న అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి నల్లిమిల్లి జోసఫ్ చెప్పారు. ఈ పదవితో పాటు ఉపాధ్యక్షుడిగా వైదాని నాగేశ్వరరావు, సహాయ కార్యదర్శిగా నక్కా ఆనంద్‌బాబు, లైబ్రరీ కార్యదర్శిగా నారిన శ్రీనివాస్, సాంస్కృతిక కార్యక్రమాల కార్యదర్శిగా రాయసం రాధారాణి, కోశాధికారిగా పూరిళ్ల శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా మణి, కార్యవర్గ సభ్యులుగా తంగెళ్ల నాగేశ్వరరావు, కొల్లాబత్తుల చంద్రశేఖర్, మహిళా కార్యవర్గ సభ్యులుగా ఓసూరి జ్యోతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు జోసఫ్ తెలిపారు. అయితే ప్రధాన కార్యదర్శి పదవులుగా విన్నా ప్రకాశ్, రొక్కాల గ్లాడ్‌సన్ కుమార్ పోటీలో ఉన్నారు. వీరితో పాటు కార్యవర సభ్యులకు ఐదుగురు బరిలో నిలిచారు. ఈ పదవులకు ఈనెల 13న ఎన్నిక జరగతుందన్నారు.

మాజీ కౌన్సిలర్ ధనాని ప్రకాశ్‌కు సత్కారం



ప్రకాశ్‌ను సత్కరిస్తున్న టీడీపీ నాయకులు, శ్రీరామాలయం కమిటీ సభ్యులు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన శత చిత్రాల దర్శకుడు కోడి రామకృష్ణ పేరుతో ఇచ్చిన అవార్డును అందుకున్న 30వ వార్డు మాజీ కౌన్సిలర్, సేవాభిలాషి ధనాని ప్రకాశ్‌ను 31వ వార్డుకు చెందిన శ్రీరామాలయం కమిటీ సభ్యులు, టీడీపీ కార్యవర్గ సభ్యులు శుక్రవారం రామాలయం వద్ద ఘనంగా సత్కరించారు. కార్యక్రమానికి రాష్ట్ర టీడీపీ లీగల్ సెల్ సభ్యుడు బొంతు వెంకట తిరుమలరావు అధ్యక్షత వహించారు. టీడీపీ నాయకులు ఎస్.వెంకటరెడ్డి, మజ్జి అప్పలనాయుడు, పోతుల ఉమాశంకర్, బూసి రాజేష్, పాకా పుల్లారావు, కిలారి రామారావు, నరేంద్ర, దొండపాటి జయకుమార్, లంక భాస్కర్, సన్యాసి నాయుడు, జె.పండు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏటిగట్టును పట్టించుకోండి

(5వ పేజీ తరువాయి)

ఉత్పత్తులను సిద్దాంతం, రావులపాలెం మార్కెట్‌లకు తరలించేందుకు ఈ మార్గం అనువుగా ఉండేది. ట్రాక్టర్‌లు, ఆటోలు, ఇతర వాహనాలపై కూరగాయల ఉత్పత్తులను మార్కెట్‌లకు తీసుకెళ్లి విక్రయించేవారు. దగ్గర మార్గం కావడంతో రవాణా చార్జీలు తక్కువయ్యేవి. పదేళ్లుగా రహదారి మార్గాన్ని అధికారులు పూర్తిగా విస్మరించడంతో అధ్వాన్నంగా తయారైంది. గత పుష్కరాల సమయంలో అక్కడక్కడ మరమ్మతులు చేసిన తర్వాత పట్టించుకున్న దాఖలాలు లేవు. దీంతో ఎక్కడబడితే అక్కడ భారీగా గోతులు ఏర్పడ్డాయి. నడిపూడి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమల్లి, భీమలాపురం ప్రాంతాల్లో రాళ్లు లేచి మరింత అధ్వాన్నంగా మారాయి. ప్రస్తుతం ఆటోలు, ట్రాక్టర్ల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ప్రస్తుతం వస్తున్న గోదావరి సమయంలోను ఏటిగట్టు రహదారితోపాటు పలుచోట్ల బలహీనంగా మారడంతో గోదావరి వరదల సమయంలో ప్రజలను భయపెడుతోంది. ఏటిగట్టును పటిష్టం చేసి రోడ్డును అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



తాడేపల్లిగూడెంలో బలుసులమ్మ



పెనుమంట్రలో కరెన్సీ నోట్ల అలంకరణలో లక్ష్మిదేవి అమ్మవారు



యలమంచిలిలో రూ.9.20 లక్షల నోట్లతో ధనలక్ష్మి అలంకరణలో శ్రీపుంతలో ముసలమ్మ



ప్రత్యేక అలంకరణలో పెనుగొండ వాసవీ మాత



ఎల్‌బీచర్ల గ్రామంలో గంగాలమ్మ అమ్మవారు

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు

» అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిట

» పలు చోట్ల అన్నసమారాధనలు

జిల్లా వ్యాప్తంగా శ్రావణ మాసం మూడో శుక్రవారం, వరలక్ష్మి వ్రతం పూజలను మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇళ్ల వద్ద మహిళలు వరలక్ష్మి పూజలు నిర్వహించారు. ప్రతీ ఇంట వరలక్ష్మి పూజలతో సందడి నెలకొంది.

తాడేపల్లిగూడెం/పెంటపాడు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలు భక్తతో కిటకిటలాడాయి. తాడేపల్లిగూడెంలోని బలుసులమ్మ గుడి వద్ద భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఏలూరురోడ్డులో ఉన్న సర్వమంగళ అమ్మవారి ఆలయంలో భక్తుల తాకిడి అధికంగా ఉంది. పెంటపాడు మండలం ప్రత్తిపాడు వై.జంక్షన్ వద్ద ఉన్న కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఈవో యాళ్ల శ్రీధర్ పర్యవేక్షించారు.

● తణుకు రూరల్/అత్తిలి :తణుకు మండలం మండపాక యల్లారమ్మ ఆలయం, దువ్వ దానేశ్వరి ఆలయాల వద్ద మహిళలు వరలక్ష్మీ వ్రతాలు పూజలు నిర్వహించారు. అత్తిలి మండలం అత్తిలి శివారు రామన్నపేటలో గల ఐశ్వర్య దుర్గ అమ్మవారికి అర్చకుడు చేబోలు రామలింగేశ్వరశర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు.

● ఆకివీడు/కాళ్ల/ఆకివీడురూరల్ : ఆకివీడు పట్టణంలో వున్న పెద్దింటమ్మ, వనువులమ్మ, గంగానమ్మ-మద్దిరావమ్మ, కనకదుర్గ, మాదివాడ భ్రమరాంభిక ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కాళ్ల మండలలోని పలు గ్రామాల్లోని ఆలయాలకు మహిళలు తరలివచ్చి సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించారు. సీసలి గ్రామంలోని పోలేరమ్మకు సుమారు వంద కేజీల పసుపుకొమ్ములతో అలంకరణ చేశారు. భక్తులు దర్శించుకున్నారు. ఆకివీడు మండలం అజ్జమూరు గ్రామదేవత అజ్జాలమ్మ అమ్మవారిని భక్తులు గాజులతో అలంకరించారు. అనంతరం మహిళలు కుంకుమ పూజ నిర్వహించారు.

● నరసాపురం టౌన్ : నరసాపురం పట్టణ, మండలంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతాన్ని మహిళలు నిర్వహించారు. కనకదుర్గ, గోగులమ్మ, కొండాలమ్మ, గంటాలమ్మ, దుర్గాభవాని ఆలయాలతో పాటు ఎల్‌బీచర్ల గ్రామంలోని గంగాలమ్మ ఆలయాల్లో భక్తులు రద్దీ కనిపించింది.

● గణపవరం : గణపవరం మండలంలోని అమ్మవారి ఆలయాలు, ప్రతి ఇంటా పలు రకాల పిండివంటలు, పండ్లతో మహిళలు భక్తిశ్రద్ధలతో వరలక్ష్మివ్రతం పూజలు నిర్వహించారు.

● ఆచంట/పెనుగొండ/పెనుమంట్ర : ఆచంట మండలం వల్లూరు వనుమలమ్మ అమ్మవారు వరాహి అలంకరణతో భక్తులకు దర్శనం ఇచ్చా రు. అమ్మవారిని ఎమ్మెల్యే పితాని తనయుడు వెంకట్, టీడీపీ మండల అధ్యక్షుడు చిలుకూరి సీతారామ్, తాళం శ్రీనివాస్, తోట నానాజీ, చిట్టూరి శ్రీనివాస్, కేతా మీరయ్య, చిట్టూరి రాంబాబు, పీవీరావు అమ్మవారిని దర్శించుకున్నారు. పెనుగొండ మండలం పెనుగొండ శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారిని ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు.పెనుమంట్ర మండలం మార్టేరు శివారు శివరావుపేటలో వున్న లక్ష్మీగణపతి భద్రాద్రి రామచంద్ర స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకుని మహాలక్ష్మి అమ్మవారికి మూడో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా ధనహారంతో అలంకరించారు.

● పాలకొల్లు అర్బన్/యలమంచిలి : పాలకొల్లు యడ్ల బజారులోని కనక దుర్గమ్మ ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారికి పూజలు చేశారు. ఆలయంలో భక్తులు ఆనంద సాయి స్వీట్ హోమ్ నిర్వాహకులు కోరాడ వెంకట్రావు విజయనిర్మల, కోరాడ గోవిందరావజు, అన్నపూర్ణ, కోరాడ రాజేశ్వరరావు, విద్యాధరి దంపతులు, కుటుంబ సభ్యుల ఆర్థిక సాయంతో సుమారు మూడు వేల మందికి అన్నసమారాధన నిర్వ హించారు. ఈవో ఎన్.సతీశ్‌కుమార్, సిబ్బంది చిట్టి రాంబాబు, సత్యనారాయణ, భక్తులు, వలంటీర్లు సేవలు అందించారు. యలమంచిలి మండలం యలమంచిలి శ్రీమూలస్థానేశ్వరి అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకరించారు. స్థానిక శ్రీపుంతలో ముసలమ్మ అమ్మవారికి రూ.9.20 లక్షల నోట్లతో ధనలక్ష్మి అలంకరణ చేశారు. మహిళలు అమ్మవార్లను దర్శించుకుని లలిత సహస్రనామ పారాయణ చేశారు.



గాజుల అలకరణలో.. ఆకివీడులో భ్రమరాంభిక మాత ← అజ్జమూరులో అజ్జాలమ్మ అమ్మవారు →





పీఎం లంక గ్రామంలో కరపత్రాలందిస్తున్న పొత్తూరి, కొల్లు

తీర ప్రాంత సమస్యల్ని పరిష్కరిస్తాం

నరసాపురంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో నెలకొన్న సమస్యల్ని దశలవారీగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు అన్నారు. శుక్రవారం పీఎంలంక గ్రామంలో మత్స్యకార సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ కొల్లు పెద్దిరాజులతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధిని వివరిస్తూ కరపత్రాలందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఏడాది కాలంలోనే అమలు చేసిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఇటువంటి ప్రభుత్వానికి ప్రజలు అండగా ఉండాలన్నారు. వాతాడి ఉమా, సంకరపు వెంకటేశ్వరరావు, చిన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



పైడిపర్రులో తల్లిపాలపై కళాజాత ప్రదర్శన

తల్లిపాలపై కళాజాత ప్రచారం

తణుకు రూరల్, అగస్టు 8(ఆంధ్రజ్యోతి):ప్రజల్లో ముఖ్యంగా మహిళల్లో పిల్లలకు తల్లిపాలను అందించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ కళాజాత ద్వారా ప్రచారం నిర్వహించారు. శుక్రవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలలో భాగంగా తణుకు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పైడిపర్రులోని అంగన్‌వాడీ కేంద్రాల సమీపంలో రైల్వే స్టేషన్, బస్‌స్టేషన్ సమీపంలో ఈ కళాజాతాల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ బిడ్డల ఆరోగ్యం వంటి అంశాలను వివరించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు వి. కృష్ణకుమారి, ఎం. అరుణకుమారి, సీహెచ్ వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, కళాజాత సభ్యులు పాల్గొన్నారు.

బధిరుల స్కూలు వార్షికోత్సవానికి సహకారం అందిస్తా

భీమవరంటౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):భీమవరం శ్రీవేంకటేశ్వర బధిరోన్నత పాఠశాల 40వ వార్షికోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని, సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పులపర్తి అంజిబాబు అన్నారు. బధిరోన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు, బధిర క్రీడాకారుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చే నెల 10న నిర్వహించే వార్షికోత్సవానికి సహకారం అందించాలని కోరుతూ శుక్రవారం ఎమ్మెల్యే అంజిబాబును కలిసి వినతి పత్రాన్ని అందించారు. అనంతరం వార్షికోత్సవ కమిటీ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షుడు సీహెచ్ తాతారావు, సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాస్‌రాజు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

పది మంది వృద్ధులకు ఉచిత కంటి ఆపరేషన్లు

పాలకొల్లు టౌన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):పాలకొల్లు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో పది మంది పేద వృద్ధులకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించారు. లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసిన అనంతరం క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు మాట్లాడుతూ శుక్రవారం స్థానిక లయన్స్ కంటి ఆసుపత్రిలో పది మంది పేదలకు కంటి ఆపరేషన్లను చేయించామన్నారు. క్లబ్ కోశాధికారి పోతుల ఉమాశంకర్, సభ్యులు జవ్వాజి కళ్యాణ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో కేబుల్ వైర్ల దగ్ధం



తాడేపల్లిగూడెంరూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): తెల్లవారు జామున విద్యుత్ స్తంభానికి అల్లుకున్న కేబుల్ వైర్ల చుట్టూ మంటలు వ్యాపించడంతో స్థానికులు ఉలిక్కిపడిన ఘటన తాడేపల్లిగూడెంలో శుక్రవారం జరిగింది. అగ్నిమాపక అధికారి కేవీ మురళీ కొండబాబు తెలిపిన వివరాలివి.. విద్యుత్ స్తంభానికి అల్లుకుని ఉన్న విద్యుత్ వైర్లకు షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించడంతో స్థానికులు అగ్నిమాపక కార్యాలయానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై చర్యలు తీసుకుంటాం



పాలకొల్లు టిడ్కో గృహాల వద్ద డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలిస్తున్న సీఐ రజనీ కుమార్

పాలకొల్లు అర్బన్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : పట్టణ, రూరల్ ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, జూద క్రీడలు నిర్వహించినా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ కోలా రజనీకుమార్, రూరల్ సీఐ గుత్తుల శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం వారు మాట్లాడుతూ తమ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలను ప్రోత్సహించేది లేదని స్పష్టం చేశారు. పేకాట, గుండాట, కోడి పందేలు, క్రికెట్ బెట్టింగ్ వంటి జూద కార్యకలాపాలు, మాదక ద్రవ్యాల వినియోగం, అమ్మకాలు చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. టిడ్కో గృహాల వద్ద ప్రత్యేక ఔట్ పోస్టును ఏర్పాటు చేశామన్నారు. టిడ్కో గృహాల వద్ద రక్షణ చర్యలపై డ్రోన్ కెమెరా పనితీరును పరిశీలించారు. జిల్లా ఎస్పీ అద్నాం నయీమ్ అస్మి,డీఎస్పీ డాక్టర్ శ్రీవేద ఆదేశాల మేరకు పట్టణంలోని పలు లాడ్జిలు, కల్యాణ మండపాలను తనిఖీ చేశామని ఓ ప్రకటనలో తెలిపారు

దర్భరేవు డ్రెయినేజీలో పూడిక తీత చేపట్టాలని ధర్నా



డ్రెయినేజీ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

నరసాపురం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): దర్భరేవు గ్రామంలో మురుగు డ్రెయినేజీ పూడిక పనులు చేపట్టాలని ఏపీ కౌలు రైతు సంఘం డిమాండ్ చేసింది. శుక్రవారం డ్రెయినేజీ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. దర్భరేవు నుంచి కొత్తకాయలతిప్ప వరకు ఉన్న డ్రెయినేజీ తవ్వకపోవడం వల్ల వేలాది ఎకరాలు ముంపు బారిన పడుతున్నాయన్నారు. అధికారులు స్పందించి డ్రెయినేజీని పూడిక పనులు చేపట్టాలని సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రామాంజనేయులు, కె.మాణిక్యాలరావు డిమాండ్ చేశారు. వెంకటేశ్వరావు, శ్రీను, హనుమంతురావు, తాతయ్య, నర్సింహారావు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు : ఏడీఏ ప్రసాద్



రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ ప్రసాద్ జీవన్

ఆకివీడు రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): సార్వా సాగుకు ఎరువులు అందుబాటులో ఉన్నాయని ఏడీఏ ప్రసాద్ జీవన్ అన్నారు. శుక్రవారం చెరుకుమిల్లి సొసైటీలోని ఎరువుల గొడౌన్‌ను ఆయన పరిశీలించారు. ఆకివీడు, ఉండి, కాళ్ళ మండలాలకు 323 టన్నులు యూరియా అందుబాటులో ఉందన్నారు. ఆకివీడు మండలంలో 1970 హెక్టార్లలో వరి సాగవుతోందని, 158 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరమవ్వగా ఇప్పటివరకు 250 మెట్రిక్ టన్నులు వచ్చిందని, ఇంకా 42 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. రెండు రోజులలో 70 మెట్రిక్ టన్నులు ఎరువులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఉండి మండలంలో 4600 హెక్టార్లలో వరి సాగు అవుతుం డగా, 300 మెట్రిక్ టన్నులు యూరియా అవసరమైతే 250 మెట్రిక్ టన్నులు వచ్చిందని, కాళ్ళ మండలంలో 2100 హెక్టార్లలో వరి సాగవు తుండగా, 170 మెట్రిక్ టన్నులు అవసరమైతే, 225 మెట్రిక్ టన్నులు వచ్చిందని తెలిపారు. యూరియా, కాంప్లెక్సు ఎరువులు రైతులకు అవసరమైన మేర డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజు ఆదేశాలతో సిద్ధంగా ఉంచామని తెలిపారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



ఆలయం వద్ద షెడ్ ప్రారంభిస్తున్న పెద్దలు

కాళ్ల,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కాళ్ల గ్రామంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ 13వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కాళ్లకూరు గ్రామానికి చెందిన దాట్ల శ్రీదేవి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయం వద్ద సుమారు లక్ష రూపాయలతో భక్తుల సౌకర్యార్థం నూతనంగా నిర్మించిన షెడ్‌ను గ్రామపెద్దలు, మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్న ప్రసాద్, ట్రస్ట్ అధినేత దాట్ల రామరాజు చేతుల మీదుగా ప్రారంభించి, అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు గుండాబత్తుల నాగేశ్వరరావు, మొగళ్ళ మాధవరావు, బండారు నాని, కొప్పినీడి గణపతి, తోంటా పెద్దిరాజు, వానపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

భీమవరం రూరల్, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి) : పెదగరువు విద్యుత్ ఉప కేంద్రం పరిధిలో లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ నిలుపుదల చేస్తామని ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వెంప, శ్రీరామపురం, శివన్నారాయణపురం గ్రామాలతోపాటు ఆక్వా, చేపల చెరువుల లైన్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుం దన్నారు.

● కాళ్ల : కాళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మలు తొలగించే పనులు నిమిత్తం శనివారం ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కాళ్ళ, కోలనపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎన్.వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు.

11న 'హరేకృష్ణ మహోత్సవం'

తణుకు, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): ఇస్కాన్ తాడేపల్లిగూడెం ఆధ్వర్యంలో ఈనెల 11న తణుకులోని కమ్మ కల్యాణ మండపంలో శ్రీకృష్ణ జన్మాష్టమి మహోత్సవంలో భాగంగా హరేకృష్ణ మహోత్సవం నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ తాడేపల్లిగూడెం ఇన్‌చార్జి శ్రీమాన్ మురళీనాథ్ దాసు తెలిపారు. శుక్రవారం తణుకు ఇస్కాన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహోత్సవంలో భాగంగా హరినామ సంకీర్తన, ప్రవచనం, జప మెడిటేషన్, రాధాకృష్ణుల మహాభిషేకం, చప్పన భోగ సమర్పణ, మహా హారతి, మహా ప్రసాద వితరణ వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు విచ్చేయాలని కోరారు. కారుమూరి సత్యనారాయణమూర్తి, పి.సుబ్రహ్మణ్యం శర్మ, శివకుమార్, ప్రఫుల్ల దూతాజీ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేసిన కూటమి నాయకులు

కోపల్లెలో రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

కాళ్ల, ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి): కోపల్లె గ్రామంలోని పంట కాలువ గట్టు రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. మండల పరిషత్ నిధులు సుమారు రూ.9 లక్షలతో గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్టు ఎంపీపీ పెన్మెత్స శిరీష విశ్వనాథరాజు, గ్రామ సర్పంచ్ బూడి నాగమణి, ఉపసర్పంచ్ బూడి వెంకటపర్రాలు తెలిపారు. పూర్తి నాణ్యతతో రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయనున్నట్టు వారు స్పష్టం చేశారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

'దోమల నివారణకు కృషి చేయాలి'

తణుకు,ఆగస్టు 8(ఆంధ్రజ్యోతి):ఇంటి పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణకు కృషి చేయాలని సబ్ యూనిట్ ఆఫీసర్ జి. వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని జంగం చెర్వు ఏరియాలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నిల్వ ఉన్న నీరు తొలగించాలని సూచించారు. అనంతరం వార్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

● గణపవరం :గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యఆరోగ్య విస్తరణాధికారి జాలాది విల్సన్‌బాబు అన్నారు. శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా కొత్తపల్లి గ్రామంలో దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.